అనుగ్రహానంద మహోత్సవం

రసరమ్య రజతోత్సవం



గురోబినతిమి కరి హృదయ మందిరీ యా బసా!


సమస్త జగతి గురు స్వరూప చీ కసో మానసా!

కరో సతత సత్కృతి మతిహోదే జగత్జీవనా!

ఓ సద్గురూ! నా హృదయ మందిరంలో నిలచి

ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి!

ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!



# గురుకృప



### బాబాకు దగ్గర కావాలంటే మన జీవన విధానం ఎలా ఉండాలి?

**గురుబంధువు :** గురువుగారూ! బాబాకు దగ్గర కావాలంటే మనం ఎలా జీవించాలి? మన జీవన విధానం ఎలా ఉండాలి?

**గురువుగారు :** ఒక్క మాటలో చెప్పాలంటే, బాబాకు దగ్గర చేసే రకంగా ఉండాలి (నవ్వులు). అది ఎట్లాగా అంటే మనం ఎవరికైనా దగ్గర కావాలనుకుంటే ఏమేమి చేస్తాం?

**గురుబంధువు :** వాళ్ళకి ఇష్టమైనట్లు ఉండటం, వాళ్ళకు ఇష్టమైన పనులు చేయడం..

**గురువుగారు :** అవే చేయాలి, దానికి ప్రత్యేకంగా ఒక ఆధ్యాత్మిక పరిభాష ఏమీ అవసరం లేదు. మనం ఎవరికైనా దగ్గర కావాలనుకుంటే మనమేం చేస్తాం? మనం ఏమి చేస్తామో అది బాబా పరంగా అప్లై చేసుకోండి. అదే మనం చేయాల్సింది. అదే బాబాకు కూడా ఇష్టం. ముందు బాబా పరంగా బాబాకు దగ్గర కావాలంటే బాబా పట్ల మనకు ప్రేమ ఉండాలి. ప్రేమే లేకపోతే దగ్గర కావాలని ఎందుకు అనుకుంటాం? కాబట్టి బాబా పట్ల మనకు ప్రేమ ఎట్లా పుట్టాలో ఆలోచిస్తాం. ఎవరి పట్లయినా ప్రేమ ఎలా పుడుతుంది? మళ్ళీ తిరిగి, తిరిగి ఆలోచించడం ద్వారా పుడుతుంది.



ఒకసారి ఒకరోజు టి.వి. చూసారనుకోండి, రెండుసార్లు టి.వి. చూసారనుకోండి. మూడోరోజు చూడాలి, చూడాలి అనిపిస్తుంది. ఏదో ఇట్లాంటి ప్రదేశాలకి రెండురోజులు వచ్చారనుకోండి. రెండురోజులు ఆగుతుంది. మూడో రోజున పోతుంది మళ్ళా. ఏదైనా సరే మనసుకుండేటువంటి ఆలోచన ఏమిటంటే, మళ్ళీ మళ్ళీ తిరిగి తిరిగి దాని గురించి ఆలోచిస్తే దాని పట్ల ఇష్టం పెరుగుతుంది.

అందుకని బాబాను మనకు గుర్తుచేసేటువంటిది. అది సత్సంగం కావచ్చు, బాబా చరిత్ర కావచ్చు. అంటే ఇంటినిండా బాబా ఫోటోలు పెట్టుకోవచ్చు, ఎటు చూసినా బాబా కనిపించేటట్లు. మాట్లాడితే బాబా భక్తులతో బాబా గురించే మాట్లాడాలి. "సాయిఊసు, సాయిధ్యాస" అని చెప్పాను నేను. అలా చేసుకుంటూ పోతే బాబా పట్ల ప్రేమ పెరుగుతుంది. బాబా పట్ల ప్రేమ పెరిగితే, మనకు కావలసిన ఇష్టమైనటువంటి వస్తువు సాధించేదాని కోసం మనం ఎట్లా చేస్తామో, అది మనకు తెలియకుండా చేస్తాం. అది ఎవరూ చెప్పవలసిన అవసరం లేదు.

మీరు తిరువణ్ణామలై దీక్ష చేసుకోవడానికి రావాలి అని మీకిష్టంగా ఉంది. ఇంట్లో అడ్డంకులు వస్తాయి. కొంతమంది వద్దంటారు. చాలా ఇబ్బందులుంటాయి. ఎవరి ఇబ్బందులు వాళ్ళకున్నాయి నాకు తెలుసు. ఎట్లాగో గలాయించుకుని రాలేదా మీరు? ఎవరు నేర్పించారు మీకు ఈ టెక్నిక్స్ అంతా? ఎవరి టెక్నిక్స్ వారికున్నాయి. అట్లాగే నేర్చుకుంటారు. దానికి ఎవ్వరూ చెప్పాల్సిన అవసరం లేదు. కావాల్సింది ప్రేమ. బాబాపట్ల ఇష్టం. అవి ఉంటే అన్నీ ఆటోమేటిక్‌గా సహజంగా వస్తాయి.

**– సాయిపథం, శిరిడీ**



'సత్యాన్ని' మాత్రమే పలకండి. మత విద్వేషాలను పూర్తిగా వదిలివేయండి. జ్ఞానాన్ని, ఆత్మోన్నతిని పొందడానికి ప్రతి వారు కష్టపడవలసిందే. అందరినీ ప్రేమించండి – అందరూ ఆనందంగా జీవించాలని ఆకాంక్షించండి" అని దిశానిర్దేశం చేసారు.

వ్యక్తి స్వతంత్ర్యమే నిజమైన వ్యవస్థ స్వతంత్రంగా భావించి, ఏనాడైతే మనిషి ఇంద్రియాలకు వశం కాకుండా, తనను తాను తెలుసుకుంటాడో, సాటివారిని కూడా తనలా భావించగలుగుతాడు. సర్వజీవ సమదర్శిగా మెలిగే వేళ మనిషి దైవంగా ఎదిగేందుకు మార్గం సుగమవుతుంది. సద్గురు చంద్రుల ఆగమనం సకల జగత్తుకు శ్రేయోదాయకం – ఆనంద కారకం. మనిషి చేయవలసిందల్లా గురువును 'గుర్తించడమే'. ఆ మానుష రూపంలో భాసిల్లే దైవం యొక్క పదముద్రలను పరవశంతో అనుసరించడమే. ఎదురయ్యే ప్రతీ సంఘటనలో సద్గురులీలా వినోదాన్ని దర్శించడమే మన అడుగులను సరిదిద్దుకుంటూ, ఆచరణ రూపానికి తెచ్చుకుంటూ సద్గురు కీర్తిస్తంభానికి ప్రతీకగా నిలిచే ప్రయత్నం చేయడమే. ఇది తరించే చోటు. సద్గురు అనుగ్రహాశీస్సుల వర్షానికి లేదు లోటు. శుభం భవతు. సద్గురుచరణ సేవన ప్రాప్తిరస్తు.

**– గురుకృప.**



అర్హత చూడకుండా ప్రేమించేదెవరు
అవ్యాజంగా అనుగ్రహించేదెవరు
తడబడిననాడు నిలబెట్టేదెవరు
ఆదమరచిన వేళ మేలుకొలిపేదెవరు
చీకట్లు ముసిరినపుడు వెలుగులు నింపేదెవరు
నిరుత్సాహపు నిర్వేదంలో ఉత్సాహపు ఊపిరిలూదేదెవరు
ఎవరికీ ఏమీ కాని వాళ్ళకు అన్నీ అవగలిగిందెవరు
అన్ని ఆశలు వదులుకున్న వాళ్ళకు రక్షణగా నిలిచేదెవరు
పథమై పరచుకొని, రథమై కదలి గమ్యాన్ని చేర్చేదెవరు
ప్రశ్నలెన్నో కానీ మా సమాధానం మాత్రం

**మీరు**

– భీమ్, చెన్నై




సంపుటి : 25
సంచిక : 1

జనవరి 1
2022



గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

రసరమ్య రజతోత్సవం 4
– గురుకృప

పథగామి 7
– గురుకృప

అయాచితంగా అందుకునేదే అనుగ్రహం 11
– డా॥ సాయివరప్రసాదరావు

15 బాబా మూడు రోజుల సమాధి –సాయిపథం, శిరిడీ

18 సద్గురు ప్రేమాక్షరాల రజతోత్సవం
– ఉపేంద్ర, చెన్నై

25 అవ్యాజ'ప్రేమాంతరంగికం'
– సాయినాథుని శృతి



నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు**

**GURUKRUPA**

Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



## రసరమ్య రజతోత్సవం ... కృతజ్ఞతా మహోత్సవం...

ఇరవై ఐదు సంవత్సరాల అనుగ్రహ వృష్టి. సద్గురు అనంత ప్రేమ సృష్టి. ఉత్సవ విశేషాలు, సాయిపూజా మహోత్సవ ఉత్సాహ సంబరాలు, సంరంభాలను పంచుకునే ఒక 'లఘు' పత్రికగా ప్రారంభమైన 'గురుకృప' – గురువు గారికి మనపై గల అవ్యాజప్రేమను అనుక్షణం ఆస్వాదించేందుకు శ్రీసాయి ప్రసాదించిన 'వర' పుత్రికగా రూపుదిద్దుకుంది. చిరుపత్రికను ప్రారంభించాలన్న ఆలోచనను ఆచరణకు తెచ్చిన వారికి గానీ, ఇరవై ఐదు వసంతాలు సద్గురు ప్రసాదంగా భావించి ఏనాడూ ఏదీ ఆశించక గురుచరణమే చాలనుకుని, శరశ్చంద్రుని చేతిలో పనిముట్టుగా ఈ పవిత్రకార్యాన్ని నిర్వహిస్తున్న వారికిగానీ, 'ఆ చేయి ఎంత హాయి'గా ఉంటుందో పంచుకున్న వారికి గానీ, మనములు శరత్‌ప్రేమ హిమములుచే శాంతినొందిన వేళ అక్షరసుమములతో ఆ సద్గురుచంద్రుని కీర్తించిన ఎందరో ప్రేమికులకు గానీ, గృహసీమలలో కార్యభారములతో అలసే వేళలో కూడా మనో మందిరముల ఆ శరశ్చంద్రునికి నిత్యపూజలు సలుపుతూ ఎన్నో అనుభవ లీలా విశేషములను పంచుకున్న సాయిపథ తల్లులకు గానీ, బుజ్జాయిలుగా ఎన్నో ఆనందానుభూతులను ప్రోది చేసుకుని నేడు తండ్రులై వారి ప్రేమ వినీలాకాశములో 'చుక్క'లన్ని అనుభవాలను పంచుకున్న తండ్రులకు గానీ, వృద్ధాప్యమును శరీరం గుర్తు చేస్తుంటే, ఆ ప్రేమసిరి గల 'స్వామి' గుర్తుకొచ్చిన వేళ మరోసారి నవయువకులై ఆ సాహచర్యపు మాధుర్యపు చవిని పంచే 'తాత'లైనా, ఇదిగో ఒక కడజాతి వాడు, అక్షరజ్ఞానపు అణుమాత్రపు స్పర్శకు కూడా నోచుకోని వాడు, ఇన్ని అక్షర పంక్తులను ఆ కల్పతరువు, పరంధాముడు, పరమాత్మ, అనంతప్రేమ స్వరూపుడు అయిన ఆ శరశ్చంద్రుని చరణాలకు సమర్పించుకున్నా, అది కేవలం "మూకంకరోతి వాచాలం పంఘుంలంఘయతే గిరిం – యత్కృపా తమహం వందే పరమానంద సద్గురుమ్" "ఎవ్వరి కృప మూగవానికి అద్భుతంగా మాటలిచ్చి, కుంటివానిని కొండలు దాటిస్తుందో, ఆ పరమానంద సద్గురువునకు వందనం" అన్నట్లే. సాయిపథగాములను ప్రేమతో పలకరిస్తే తమ ఆనందజీవనయానానికి శ్రీబాబాజీ శ్రీచరణుల అనుగ్రహాశీస్సులే కేవల కారణమని, వారి అవ్యాజప్రేమ అనుభవైక వేద్యమని, వారి లీలావినోదాల వైశిష్ట్యాన్ని, వారి ఆచరణాత్మక బోధల ఆంతర్యపు వెలుగులలో తమ జీవిత వైవిధ్యాన్ని అనుక్షణము ఆస్వాదించామని, జీవితంలోని రసాత్మకతను అనుభూతిప్రదంగా మలచుకుంటున్నామని తెలియచెపుతారు. "తాము శ్రేయోదాయకమని నమ్మిన మార్గాన్ని సాటివారితో పంచుకోవడం మానవ నైజం" అన్న గురుదేవుల మాటల బాటలలో వెలుగుతున్న దీపం, మరో దీపాన్ని వెలిగించే క్రమంగా మొదలు అనుభవాల మాలలను, తర్వాత





దేశ చరిత్రలో ప్రారంభ మయ్యింది. ఇదిగో స్వామివారి సందేశం భారతజాతికి.. "భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధిస్తున్న ఈ క్షణాల్లో దేశ ప్రజలంతా భగవంతుని మనఃస్ఫూర్తిగా ప్రార్థించాలి. జ్ఞాన సంపదను, మానసిక స్థైర్యాన్ని మనందరికి ఇమ్మని ప్రార్థిద్దాం. భగవదనుగ్రహంతోనే మనం మన స్వతంత్రాన్ని కాపాడుకుంటూ, విశ్వమానవాళి అనందంగా జీవించడానికి తోడ్పడవలె. చక్రవర్తి అశోకుని బోధనలు గుర్తుచేసే చక్రము మన జాతీయ పతాకం మధ్యలో ఉండడం సంతోషపరిణామం. ఇది గీతాచార్యుడు ధర్మము చక్ర స్వరూపములో వెలుగొందుతుందన్న వాణిని గుర్తు చేస్తుంది. దేహము అన్నము నుండి, అన్నము వర్షము నుండి, వర్షము యజ్ఞము నుండి, యజ్ఞము కర్మల నుండి, కర్మలు వేదాల నుండి, వేదాలు బ్రహ్మము నుండి (అంటే భగవంతుని నుండి) ఉద్భవించాయన్న మరో 'చక్రం' కూడా గుర్తుకు తెస్తుంది.

ఇట్టి స్వతంత్రము మనకు నాలుగు ప్రధాన ప్రయోజనములు చేకూర్చవలె. అవి 'ధర్మము' అనగా నీతిగా జీవించడాన్ని, 'అర్థము' అనగా వస్తు సంపదను, 'కామము' అనగా సంతోష జీవనాన్ని, 'మోక్షము' అనగా చరమ స్థితిని అందించుగాక! ఎన్నో సంవత్సరాలు దాస్యంలో మ్రగ్గిన ఈ జాతికి సంతుల, భగవదనుగ్రహముతో, ఎందరో సమరయోధుల త్యాగము, నిష్ఠలతో స్వతంత్రం సిద్ధించినది. ప్రేమ, సౌహార్ద్రము, సౌభాగ్యములతో ప్రజలందరూ కలిసి మెలిసి ఉందురు గాక! దేశానికి స్వతంత్ర్యము లభించిన ఈ తరుణంలో మనము వ్యక్తి స్వతంత్రమును కాంక్షించవలె! మనలను మనము పూర్తిగా తెలుసుకొనిన వేళ స్వేచ్ఛగా జీవించగలము. ఇంద్రియాలు మనసును శాసించడంవల్ల మనం మన కోర్కెలపై, అహంపై పట్టు సాధించలేకపోతున్నాము. ఇవి రెండూ మనలను సతతము ఇబ్బందికి గురి చేస్తున్నాయి. ఎంత పొందినా తృప్తిగా జీవించలేక పోతున్నాము. ప్రాపంచిక దుఃఖాల నుండి విముక్తి పొందలేక మనసు కలత చెందుతోంది. దీనికి పరిష్కారం ఏమిటి? పరిపరి విధాలుగా పరుగులెత్తే మనసును ఒకొక్క మెట్టు ఎక్కినట్లు అదుపులోకి తెచ్చుకోవాలి. ఒక్కసారి ఆ మనసుపై అదుపు సాధిస్తే చాలు – స్వేచ్ఛ లభించినట్లే. కలవరపెట్టే అంశాలను విడిచి భగవంతునిపై ధ్యానాన్ని నిలుపుకుంటే మెల్లగా మనసు శాంతినొందుతుంది. ఇలా కామాన్ని, క్రోధాన్ని జయించగలుగుతాము. సాధన కొనసాగిస్తే మనిషి కాలక్రమంలో 'ఆత్మ'ను సాక్షాత్కరించుకో గలుగుతాడు. అలా 'స్వేచ్ఛ'ను పొందినవాడే సంపూర్ణ జ్ఞానాన్ని సిద్ధించుకోగలుగుతాడు. పరస్త్రీలను తల్లులుగా భావించండి. ఇతరుల జీవితాలను మీ జీవితాలుగా గుర్తించండి. ఎంతటి కఠిన స్థితిలోనైనా



ఇంతకంటే కావాల్సిందేముంది. 'మామ' స్వామివారి చిత్రపటాన్ని – 'స్వామి'వారిగానే భావించాడు. భక్తుని భావన పూర్ణమయింది – భక్తుల 'మనోరథం' పరిపూర్ణమయ్యింది. తరతరాల మనోరథాలను తీర్చే ఆ రూపం మనందరికీ సంప్రాప్తమయ్యింది. అందుకే శ్రీసాయి సద్గురుచంద్రులు కూడా "నాకూ నా చిత్రపటానికి బేధం లేదు – నా చిత్రపటాన్ని పూజిస్తే నన్ను పూజించినట్లే" అన్నారు. గురువు రూపం – జగత్తుకు ఆనంద స్వరూపం – అభయస్వరూపం. అది అవతగమవ్వక పోవడం లోపం. అవగతమయితే ఆ రూపమే అన్ని తమస్సులను తొలగించే దేదీప్యమానమైన దీపం!.

1944వ సం॥లో పరమాచార్య స్వామివారి స్వర్ణోత్సవ జయంతి సంరంభం వైభవంగా జరిగింది. ఫిబ్రవరి ఏడవ తేదీన కామాక్షి ఆలయ కుంభాభిషేక ఏర్పాట్లు జరుగుతుండగా స్వామివారు జనవరి ఇరవైఏడవ తేదీ కంచిలో అడుగుపెట్టారు. వేలాదిమంది భక్తులు, ఇతర మతాల పీఠాధిపతులు, అధికార, అనధికారుల మధ్య పవిత్ర కుంభాభిషేక కార్యక్రమం శంకరనామాలతో, దేవీస్తుతులతో అంబరమంటింది. దేశం నలుమూలలా ఈ సంవత్సరమంతా విద్వత్ సభలు, సదస్సులు జరిగాయి. స్వామివారు ఈ సంవత్సరంలో తిరువణ్ణామలై వెళ్ళడము, అక్కడ అరుణాచల గిరిప్రదక్షిణ చేయడము జరిగింది. వారు కలవాయిలో కూడా కొన్ని రోజులున్నారు. శ్రీశైలంలోవలె భ్రమరాంబికా మల్లిఖార్జునులు అరుణాచలంలోని పర్వతమలైలోనూ కొలువై ఉన్నారు. నాటి కాలంలో దుర్భేద్యంగా ఉన్న ఆ పర్వతాన్ని ఎక్కి ఈశ్వర సేవ చేసుకోవడం కష్టంగా ఉండేది. అమావాస్య చీకటిలో, దీపాల వెలుగులో పర్వతమలై అధిరోహించారు స్వామి. ముళ్ళదారులను, గుబురు పొదలను దాటుకుంటూ ఈశ్వర సన్నిధానం చేరి పూజాదికాలు జరిపారు స్వామి. భగవంతుని చేరే క్రమంలో ఎదురయ్యే అవరోధాలను మొక్కవోని పట్టుదలతో అధిగమించాలి అని మనకు ఒక ఉపమానమేమో వారి ఆచరణ, ఆలోచిద్దాం.

1945వ సం॥ మహామఖం కుంభకోణంలో జరగడం, 1946 వ సం॥ వ్యాసపూజ కూడా అక్కడే జరిగింది. ఈ సమయంలో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో మతకల్లోలాలు జరిగి మారణ హోమం జరిగింది. స్వామివారు ప్రజలందరూ సుహృద్భావ వాతావరణంలో మెలగాలని, శాంతిని మాత్రమే ఆకాంక్షించాలని సందేశం పంపారు. ఈ క్రమంలో ఇబ్బందుల పాలైన వారికి ద్రవ్యము, వస్తువులు, బట్టలు, దుప్పట్లు ఇత్యాదులను మఠం ద్వారా అందించమని ఆదేశించారు స్వామి. 1947వ సం॥ దేశం పరాయి పాలనా దాస్యశృంఖాలాలను తెంచుకొని ఒక నూతన అధ్యాయం





సద్భక్తుల పథాన్ని, పదముద్రలను, తత్త్వదర్శినులైన సత్పురుషుల యొక్క ప్రత్యక్ష సన్నిధిని ప్రసాదించే మహాత్ముల చరిత్రలను, శరత్ ప్రేమికుల అంతరంగపు కడలిలో ఆవిష్కృతమయ్యే ప్రేమామృత భావ శీర్షికలను, గుండెగుడిలోని నిశ్శబ్ద నిశీథిలో గురుచంద్రులు చిరుగంటగా మ్రోగే వేళ విరబూసే కవనాలను, కథలను, గీతాలను పంచుకోవడం ఆనవాయితీగా చేసుకుంది 'గురుకృప'.

***అనుగ్రహ నిధానం :*** "నా వద్దకు అందరూ మొదట లౌకికమైన కోరికలతోనే వస్తారు. కష్టాలు, కోరికలు తీరి జీవితంలో స్థాయి చిక్కాక నన్ను గుర్తించి సన్మార్గానికి వస్తారు" అన్నారు శ్రీసాయి. అప్రతిహతంగా, గమ్యం చేర్చడమే లక్ష్యంగా సాగిపోయే సద్గురుపథం శ్రీబాబూజీ రూపంలో అందరినీ అక్కున చేర్చుకోవడం, లౌకికమైన ప్రతీ కోర్కెను – అవసరాన్ని గుర్తించి ఆశీఃపూర్వకంగా అందించడమూ, మూడు దశాబ్దాలకు పైగా అనుగ్రహ సంద్రంగా సాగిపోతోంది. "కోర్కెలను తీర్చుటలో లేదు నిదానము – కోర్కెలను తీర్చిదిద్దుటే సాయి విధానము" అని తెలియచెప్పి, శ్రీబాబూజీ తీర్చిదిద్దిన జీవితాలెన్నో! అలా విరబూసిన జీవితాల ప్రేమానుభవాలను పంచుకోవడానికి తొలివేదికయ్యింది 'గురుకృప'. ఆకలి వేసిన వేళ అన్నం పెట్టించిన వైనాలు, ఎన్నో వసంతాలు కడుపుపండని వేళ వెల్లివిరిసిన చిన్నారుల కేరింతలు, వైద్యాలకు లొంగవని తేల్చి చెప్పిన వేళ కుదిరిన అనారోగ్యాలు, తప్పటడుగులు – తప్పుటడుగులుగా మారకుండా శ్రీవారు కాపాడిన జీవితాలు, ఇలా ఎన్నో అనుభవాలను తన ప్రేమ కమతంలో పండించుకుంది **'గురుకృప'.** ఈ అనుగ్రహ గృహంలో (House of Grace) తరతరాలు సేద తీరేందుకు అవకాశముంది, మెండైన గురు ఆశీర్వచనం తోడుంది.

***ఆనంద జీవన సంవిధానం :*** "శ్రీసాయి బోధ సమగ్రమైనదే – మన అవగాహనే సమగ్రం కావలసి ఉంది" అంటారు శ్రీబాబూజీ. "నన్ను ఆనంద స్వరూపంగా ధ్యానించు! అది సాధ్యపడకపోతే, నా ఈ రూపాన్ని ధ్యానించు!" అన్నారు శ్రీసాయిబాబా. ఈ సమస్త సృష్టిలో నీవు ఎవరివి అంటే 'ఆనందాన్ని' అన్న శ్రీసాయి బాటను ప్రతీ మనిషి జీవితంలో సుసంపన్నం చేయడానికి శ్రీబాబూజీ చేయక విడిచిన కార్యం లేదు. 'నివేదన'లోని ఆంతర్యాన్ని నినదించినా, సాయిభక్తులకు కీడు జరగడాన్ని అసంగతమని కొట్టి పారేసినా, బాబా ఇచ్చిన దానిని తీసుకుని ఆనందంగా ఎలా జీవించాలో నేర్పించినా, తనకు, ప్రక్కవాడికి ఉపయోగం లేని విషయాలను గురించి సంభాషించడం వృథా అని తెలియచెప్పినా, వారిని మానవమాత్రునిగా అనుకుని తప్పులు చేస్తే – వారికి కూడా మేలు చేసి పంపి ఆనందపు తావుల అసలు అర్థాన్ని రుచి చూపించినా, ఇలా ఏ విషయాన్నైనా వారు తమ



జీవితమనే సద్గ్రంథం ద్వారానే తెలియచెప్పారు, ఆచరించి చూపారు. సద్ధర్మాచరణ పునాదులపై నిర్మితమైన సాయిపథగాముల జీవితాలు శరత్‌భక్త విజయాలుగా ఎలా కళ్యాణకాంతులను సంతరించుకున్నాయో, అందుకు వలసిన ఆనందజీవన సూచికలేమిటో, ఊహించని చీకట్లలో ఎలాంటి జీవన విధానము దీపస్థంభమై దారి చూపుతుందో ఆ పదముద్రలను ఆనందజీవన సంవిధానంగా (Culmination of Joy) పంచుకునే ప్రయత్నం చేసింది... చేస్తోంది 'గురుకృప'.

**ఆచరణ విధానం :** "జ్ఞాని ఏ కర్మ ఎట్లు చేయునో తక్కిన వారందరూ దానినే చేయుదురు. వారి ఆచరణనే ప్రమాణముగా తీసుకుందురు. కనుక లోకశిక్షణార్ధము జ్ఞానులు కర్మలు చేయవలెను" అన్నాడు గీతాచార్యుడు. సత్యద్రష్టలైన మహాత్ములు కర్మలను చేసేది – మనకు జీవించే తీరును నేర్పేందుకే. అనంత చైతన్యంతో మమేకమైన వారికి వ్యవహారం అవసరమా? మనిషి దైవంగా ఎదిగేందుకు తమ జీవితాన్నే బోధగా ప్రసాదించారు. మహాత్ముల జీవితాలను సద్గురుపథ పార్శ్వం నుండి దర్శిస్తోంది 'గురుకృప' ఎన్నో వసంతాలుగా... సద్భక్తుల, సచ్ఛిష్యుల జీవితాచరణ మనకు మార్గదర్శనం చేస్తుంది. జీవితంలో ఎదురయ్యే సంఘటనలలో సద్గురుపథంలో మెలగవలసిన తీరు, గురువును వెలిగించుకోవలసిన తీరును వారు ఆచరించి చూపారు. తత్వం కన్నా ఆచరణ మనలో త్వరగా పాదుకొనే అవకాశం ఉన్నందున నాటి శ్రీరామకృష్ణుల భక్త పరాయణులు శ్రీరామచంద్రదత్తా నుండి, సాయి సద్గురుచంద్రుల పదదాసులు శ్రీదీక్షిత్, రమణులను దర్శించి తరించిన పాల్ బ్రంటన్, ఇదిగో నేడు పరమాచార్యస్వామివారి చరణదాసులు అన్నదాన శివన్, ప్రదోషంమామ వంటి వారి వరకు గుర్తు చేసుకుంటూ, సన్మార్గంలో పయనించేందుకు ఊతం చేసుకుంటూ సాగిపోతోంది 'గురుకృపా' ప్రవాహం. ఆధ్యాత్మికత వల్లే వేసేది కాదు – నిత్య జీవితంలో ఆచరించేది, అనుక్షణం ఉపయోగపెట్టుకునేది అన్న సదుద్దేశంతో అనన్య భక్తుల జీవితక్రమాన్ని పంచుకునే వేదికగా 'గురుకృప' నిలిచింది. (Foot steps to divinity).

**అక్షర సన్నిధానం :** సమాధాన రూపం ధరించిన సద్గురుచంద్రుల సన్నిధానాలను అనవరతం ప్రసాదించగల ప్రాంగణాలు 'అక్షరాలతో' రూపుదిద్దుకుంటే అవి మనోఫలకంలో ఆ మహితాత్ముల రూపాన్ని, ఆనంద స్వరూపాన్ని ఆవిష్కరించగలవు. రజతోత్సవం జరుపుకుంటున్న 'గురుకృప' పత్రికకు కర్త, కర్మ, క్రియ గురుదేవులే. ఆ సాన్నిధ్యాన్ని అక్షరరూపంలో ప్రసాదించిన యశస్సు కూడా వారిదే. అంతరంగాన్ని ప్రభావితం చేయగల్గిన శోభ అక్షరానికి ఎంతో ఉంది (Presence in Words). అందుకే భగవాన్ వారి ప్రత్యక్ష సన్నిధికి ప్రత్యామ్నాయంగా 'చరిత్ర'ను పేర్కొన్నారు. **గురుకృపకు ఏ**





అంబారీ, నాదస్వరము, భక్తుల శంకరనామాలతో పురవీధులలో ఊరేగింపుగా ప్రారంభమయ్యారు ప్రదోషం మామ మరియు భక్తజనులు. సహజంగానే ఆరతులను, ధూప, దీప నమస్సులను అర్పిస్తూ, సాగిపోయే ఆ ఉత్సవం కొన్ని గంటలపాటు సాగింది కంచి ప్రధానదారులలో. ఈ ఉత్సవ సంరంభం స్వామివారు కంచిలో కొలువైనపుడల్లా జరిగే విశేషమే. అలా ఒక ఉత్సవం పూర్తయిన ఉదయం 'మామ'–స్వామివారి చిత్రపటాన్ని చూస్తూ విశ్రాంతి తీసుకునే సమయంలో ఆ 'మూర్తి'లో వారు నిలబడి ఉన్నారని గమనించాడు. అది చూసిన మామకు–స్వామివారికి తానెంతో కించ కలిగిస్తున్నానని, "నేను ఉత్సవమని భావిస్తున్నాను – స్వామి ఎన్నో గంటలు నిలబడి ఉండవలసి వస్తోంది. వారి కాళ్ళు ఎంతో నొప్పికి గురి అయి ఉంటాయి కదా!" అనిపించింది. కన్నీళ్ళు ఆగలేదు మామకు. మందబుద్ధులకు భావావేశం మాత్రమే ఉంటుంది. సద్భక్తులకు ఆచరణాభిలాష – అనన్య ప్రేమ, రెండూ పువ్వుకు – పరిమళంలా ఉంటాయి. 'మామ' ఇక స్వామి వారిని రథంలో నిలబెట్టటానికి ఇష్టపడలేదు. అందునా స్వామి వారు సింహాసనంపై అధిష్టించడం చూసి సంవత్సరాలయింది. అప్పటికప్పుడు స్వామి వారి కోసం ఒక వెదురు సింహాసనాన్ని, స్వామివారి కోసం పాదుకలను చేయించాడు. అంతేనా! స్వామి వారికి ఇబ్బంది కలుగకుండా ఆ సింహాసనం మొత్తం పూలతో మెత్తగా ఉండేట్లు జాగ్రత్త తీసుకున్నాడు, పాదుకలతో సహా ఆశ్రితవత్సులుడైన ఆ సద్గురుచంద్రునికి, చంద్రశేఖరునికి పూలతోనే కిరీటం కూడా చేయించాడు మామ. ఆనాడు ఏకాదశి. ఏకాదశి రోజున స్వామివారు మంచినీటిని కూడా స్వీకరించక, పూర్తిగా ఉపవసిస్తారు. అలా ఏకాదశి రోజున ప్రదోషంమామ అభిలాషను ఆంతరంగికుల ద్వారా విన్న స్వామి ఈ హడావిడి జరుగుతున్న ప్రాంగణంలోకి వేంచేసారు. ఏం జరుగుతుందా అని ఆసక్తిగా చూస్తున్న భక్తజనుల ప్రేమకు వరంగా, నేత్రోత్సవంగా స్వామివారు ఆ పుష్పాలంకితమైన వెదురు సింహాసనంపై ఆసీనులై, సుమ కిరీటాన్ని, ప్రేమసుమ పాదుకలను ధరించి, అరుదుగా గాని అవకాశమివ్వని వారు – చిత్రాలను తీసుకోవటానికి ఛాయచిత్రకారులకు కూడా అనుమతిచ్చారు. త్రికరణాలను ఏకం చేసి – గురుచరణాలను శరణంటే ఈశ్వరుడనే గురువు వరదాయిగా అనుగ్రహిస్తాడు. భక్తుల మనోమందిరాన కొలువు తీరే 'సింహాసన చక్రవర్తి' అవుతాడు. ఆనాడు స్వామివారి అనుగ్రహం – 'మామ'తో పాటు భక్తులందరిపైనా, ఆ చిత్తరువుతో నేటికీ మనందరిపైనా వర్షిస్తూనే ఉంది. ఎందుకంటే ఆనాడు వారు సింహాసనంపై అధివసించి వారి చూపుడు వేలును బొటనవేలితో తాకుతూ 'మనోరథ ముద్ర' లో దర్శనమిచ్చారు.



# గురుకృపాలహరి

**ఒక్కడే మోక్షకర్త – వొక్కటే శరణాగతి**

**దిక్కని హరిగొల్చి బదికిరి తొంటివారు**

అని కీర్తించారు 'ప్రపత్తి'ని అక్షర సంపత్తిగా, 'భక్తి'ని మానవ 'ప్రవృత్తిగా', అనన్యభక్తికి మార్గం చూపారు శ్రీఅన్నమాచార్య స్వామి. గమ్యం చేరే క్రమంలో ఎన్ని జన్మలు గడిచాయో, ఎన్ని క్షాళనకు నోచుకొని సంస్కారాలను 'గురువు' అనుక్షణం తోడుండి తొలగిస్తున్నాడో, కేవలం ఉద్ధతి – సద్గతిని మాత్రమే ఆశించే గురువు మనకోసం తోడుగా, మనలో ఒకనిగా మానవ రూపం కూడా ధరిస్తూ అవనికి వేంచేస్తుంటే ఇంతకంటే సువర్ణావకాశం సృష్టిలో ఉంటుందా! అది ఇన్ని కోట్ల జీవరాశుల్లో మనకు మాత్రమే లభిస్తుంటే సద్వినియోగం చేసుకోవద్దా? కోట్ల రూపాయల నిధి లభిస్తే మనిషి దానిని కాపాడుకోవటానికి ఎంత ప్రయత్నం చేస్తాడు... ఒక్కక్షణమైనా అలసత్వం ప్రదర్శిస్తాడా? మరి జన్మపరంపరకే సరిపడా అవసరమయ్యే పెన్నిధి – సద్గురుసన్నిధి లభిస్తే "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అంటూ అన్ని ధర్మాలను ఆ పరమపదమైన గురుపరంధాముని పొందేందుకే నిర్వర్తించాలి కదా! గురువు మాటల వేదాంతి కాదు – చేతల వేదాంతి అందుకే భగవంతునిగా తాను వస్తూనే భాగవతుని, భక్తునిగా వేలుపట్టి నడిపిస్తూ మనలో ఒకనిగా తీసుకొస్తున్నాడు – వారి ద్వారా మనకు 'శరణాగతి' పొందే క్రమం తెలియచేస్తున్నాడు, తరాలు తరించే మార్గం ఆ భక్త శిరోమణుల, పరాధీనుల జీవితాచరణ ద్వారా తెలియచెపుతున్నాడు. అందుకేనేమో శ్రీసాయినాథుని లీలా విశేషాలను కీర్తనకారునిగా గానం చేసిన శ్రీదాసగణు మహారాజ్ "ఆపనే మసీద్ కా ఝాడూ గణూ హై" అంటూ సాయిభక్తుల పాదధూళిని ప్రోగు చేసుకునే చీపురునవుతానని ప్రార్థించాడు. భగవంతుడు గమ్యమైతే – భాగవతుడు దీపస్తంభమవుతున్నాడు. భాగవతుని అనుగమిద్దాం – భగవంతుని చేరే ప్రయత్నం చేద్దాం. ఇక మరల మనం కంచి కథలోనికి వెళ్దాము.

'స్వామి'వారి జన్మనక్షత్రంనాడు వారెక్కడున్నా సరే అక్కడకే వెళ్ళి స్వామివారికి నమస్సులర్పించి ప్రార్థనాపూర్వక సాష్టాంగ దర్శనములనాచరించి మాత్రమే ఆహారాన్ని స్వీకరించే ప్రదోషంమామ వెంకట్రామయ్యర్ గారి గురించి మనం తెలుసుకున్నాం కదా! వారి 'దాస్య'భక్తి స్వామివారి పట్ల ఎలా ఉండేదో అనుభవంలో చూద్దాం. సుమారు 30 వసంతాల క్రితం సంఘటన. కంచిలో ఒక అనుషం (జన్మతిథి ఉత్సవం – ప్రతి మాసం జరిగేది) ఉత్సవం జరుగుతున్న రోజు అది. స్వామివారు మఠ ప్రాంగణంలోనే ఉన్నారు. స్వామివారి నిలువెత్తు చిత్రపటాన్ని ఒక రథంలో ఉంచి, ముందు





గొప్ప ఆశయాలో, పేరు ప్రఖ్యాతులలో లేవు. అవసరం కాబోవు. ఏ ఒక్క సద్భక్తుని తలపునైనా 'శ్రీబాబూజీ' శ్రీచరణుల ఊసును నిలుపుకునే యత్నంలో 'గురుకృప' ఒక చిన్న ఊతమైనా సరే **ఈ 25 సంవత్సరాల ప్రయాణం ఫలవంతమైనట్లే! ఏ ఒక్కరైనా శ్రీగురుదేవుల సన్నిధిని భావించగల్గినా అది రాబోయే వసంతాలకు స్ఫూర్తిదాయకమే.** ఈ అవ్యాజ ప్రేమ ప్రయాణంలో అనుక్షణము తమ ఉనికిని ప్రసాదించిన **గురుచంద్రులకు,** మనందరికీ గురుదేవులను అనుగ్రహించిన **సద్గురుసామ్రాట్టు శ్రీసాయినాథులకు,** ఏ ఒక్క క్షణమూ కూడా దారి తప్పిన బిడ్డ ఎలాంటి బిత్తర చూపులు చూస్తాడో అలాంటి పరిస్థితి రాకుండా మమ్ముగాచిన **అమ్మ "శ్రీసాయినాథుని అనసూయమ్మ"గారికి,** శరశ్చంద్రుల ప్రేమకు ప్రతిరూపమై, మనందరికీ శ్రీవారిరూపాన్ని గుర్తుకు తెచ్చే కను**'పాప'** అయి, సంతోషమైనా, ఒత్తిడైనా, ఎలాంటి పరిస్థితి అయినా చిరునవ్వుతో స్థైర్యం చెప్పే, **'శృతి'**కి వేవేల కృతజ్ఞతలు.. 'గురుకృప' చేయగలిగింది ఒక్కటే. గురుదేవుల 'ప్రేమ'ను మీ అందరి ద్వారా పొందడం.. ఆ 'అనంత' ప్రేమను అందరితోనూ పంచుకోవడం... అంతే.. అందరికీ గురువు గారి **'ప్రేమ'...**

**– గురుకృప**

## పథగామి

### చెట్టంత మనిషి

**మూలం భుజంగైః శిఖరం విహంగైః**
**శాఖాప్లవంగైః కుసుమాని భృంగైః**
**సంసేవ్యతే చందనపాదపోయం**
**పరోపకారాయ పరాం ప్రవృత్తిః**

పరోపకారం ఇదం శరీరం...మానవ జీవితసారం పరోపకారం. ఈ విషయంలో చెట్టుని చూసి నేర్చుకోవచ్చు అన్నదానిని జగన్నాధ పండితరామశర్మగారు(అమలాపురం)– చెట్టు ఎంతమందికి ఎంత ఉపకారం చేస్తుందో అన్న విషయాన్ని పై పద్యంలో చెప్పారు. కేవలం భావుకతనేగాక, శబ్ధమాధుర్యాన్ని కూడా ఆస్వాదించవచ్చు ఆయన పద్యరచనలో...ఒక చెట్టుని గమనిస్తే చాలా అర్ధం చేసుకోవచ్చు, నేర్చుకోవచ్చు. నేర్చుకోవాలనే దృక్పథం వుంటే మన జీవితంలో జరిగే ప్రతీ సంఘటన సద్గురు ప్రసాదితమే అని గ్రహిస్తాము –శ్రీబాబూజీ.

**మూలం భుజంగైహీ:** చెట్టు తొర్రలో పాములుంటాయి. అవి విషపువి కనుక దానిని పొమ్మని చెప్పలా. పాములు తమంత తాము పుట్టలు పెట్టవు. పెట్టిన పుట్టలలోనే నివసిస్తుంటాయి. ఈ తొర్ర వుంటే



ఏమైనా ఇబ్బందులు వస్తాయోమో, ఈ పాము కారణంగా, దాన్ని చంపబోయి నన్ను కొడతారేమో, ఆ దెబ్బలు నా మీద పడతాయేమో అని చెట్టు అంత భవిష్యద్దర్శనం చేయలేదు. తొర్రవున్నది ఎందుకు, ఎవరూ ఉండక పోతే ఎలా అని ఆలోచిస్తుంది. అదే మనమో, కొంచెం ఖాళీ వుంటే ఓ గది వేసి అద్దెకిస్తాము. మా కులం వారికే ఇవ్వబడును అని చెబుతాం. కాని చెట్టు అలా అనదు. చెట్టు అద్దెకుగాక ఉచితంగా ఇచ్చింది.

**శిఖరం విహంగైహి :** చెట్టు కొమ్మలపై ఎన్నో పక్షులు ఉంటాయి. కొన్ని పళ్ళు కొట్టేస్తాయి. కొన్ని ఆకులు చీలుస్తాయి. ఎన్నో రకాలుగా చేస్తాయి. ఇబ్బంది పెడుతున్నా భగవంతుడు నాకు ఇంత శిరస్సు ఇచ్చాడు. మనకు కేశపాశములున్నట్లుగా దానికి ఆకులున్నాయి. ఇది ఉపయోగపడకపోతే ఎందుకు? అని ఆలోచించి పక్షులకు నెలవైంది. మంచి వాళ్ళకే ఆశ్రయమివ్వాలా, పాములకిచ్చింది, కాసేపు ఉండి ఎగిరిపోయే పక్షులకిచ్చింది.

**శాఖాప్లవంగైః :** కోతి కొమ్మచ్చి, కోతులు ఆ కొమ్మలు పట్టుకొని ఈ కొమ్మల మీదకి ఎగురుతుంటే... కొమ్మలు విరిగిపోయినా, విసుక్కోక, కసురుకోక ఇవి అన్నీ నా పిల్లలే కదా, ఇంకెక్కడ ఆడుకుంటాయి అని వాటిని ఆడుకోనిస్తుంది, సంతోషిస్తుంది.

**కుసుమాని భృంగైహి :** పుష్పాలలో వున్న మకరందాన్ని తుమ్మెదలకిస్తుంది. ఆ ఇచ్చేటప్పుడు ఆ తుమ్మెదల కులం, మతం, ప్రాంతం, జాతి గురించి ఆలోచించలేదు, అన్నింటికి ఇచ్చింది. ఇది వృథా కారాదు అన్నదే దాని భావం. అలాగే మన జీవితమకరందం జీవనసారమైన మంచిని పదిమందికి ఉపకారం చేయగలిగితే – 'చెట్టంత మనిషి' అనే పదానికి అర్థంగా నిలుస్తాం. చెట్టు వలన 16 ఉపకారాలుంటాయి. చెట్టు నుండి మనము నేర్చుకోవలసిన 16 విషయాలు, భాగవతం దశమస్కంధంలో చెబుతారు. ఎందుకు అంటే మనకోసమే కదా! 11 గుణాలు, 5 సద్గుణాలుంటాయి. **అపకారం చేయకుండా వుంటే చాలు, ఉపకారం చేయకపోయినా,** ఇది నేర్వాలంటే ముందు మన బిడ్డల పుట్టినరోజునాడు కేక్ కోయించడం, దీపాలు ఆర్పించడం అనే పనికిమాలిన పని మానేయాలి. వాడికి ఎన్ని సంవత్సరాలయితే అన్ని కొవ్వొత్తులు పెట్టి అన్నీ ఒక్కసారే ఆర్పించడం అంటే అన్ని కొంపలు ఒక్కసారే ఆర్పేయాలని బోధిస్తున్నాం. **దీపం ఆరిపోయింది అనే మాట కూడా పలకడానికి సంశయించి, "దీపం కొండెక్కింది"** అంటాం. "దీపం ఆరిపోయింది" అన్నమాట పలకడానికి సంశయిస్తున్న జాతిలో పుట్టినవాళ్ళం, ఎలా వుంటున్నాం? ఈ ఒక్క ఆచారం మారితేచాలు. 60 సంవత్సరాలు నిండినవారు, 60 వత్తులతో దీపం వెలిగిస్తే అది కాగడాలా వెలుగునిస్తుంది. వారి





తమకు జరిగిన అన్యాయములను, కష్టములను సహించిరి. ఆపదలు వాటిల్లినను వారెవరూ బాధ్యతలను విడనాడలేదు. ఈ విధానము **సాధకుల జీవితమునకు (జీవనమునకు) ఆదర్శము కావలెను.**

**–"అనుభవజ్ఞానం" నుండి**

## అవ్యాజ'ప్రేమాంతరంగికం'

ప్రియమైన గురుబంధువులకు,

నా పుట్టినరోజునాడు జరిగిన ఒక అనుభవాన్ని, నేను పొందిన ఆనందాన్ని మీ అందరితో పంచుకోవాలనిపించింది. నిన్న నేను, రామకృష్ణన్న ఇద్దరం దర్శనానికి బుక్ చేసుకుందామనుకున్నాము. నాకు ఒక్కదానికే టికెట్ దొరికింది. రాత్రి ఎనిమిది గంటల తర్వాత బాబా దర్శనానికి వెళ్ళాము. ఆశ్చర్యకరంగా ద్వారకామాయిలో బాబా చెంత నేను తప్ప మరెవ్వరూ లేరు. నేను, బాబా అంతే. నేను బాబా దగ్గర చాలా సమయం ఉన్నాను. నేనున్నంతసేపూ ఎంతో ఆశ్చర్యకరంగా అక్కడ మరెవ్వరూ లేరు, రాలేదు కూడా. అలా ఒక్క ద్వారకామాయిలో మాత్రమే కాదు, సమాధి మందిరంలోనూ, గురుస్థాన్‌లోనూ, చివరికి లెండీలో కూడా నేనొక్కదాన్నే ఉన్నాను. లెండీలో ప్రదక్షిణలు చేసుకున్నంతసేపు కూడా ఎవ్వరూ రాలేదు. అలా అని మిగతా భక్తులెవరూ లేరు అని కాదు భక్తులు ఉన్నారు. కానీ బాబా దగ్గర మాత్రం నేనున్నంతసేపూ నేనొక్కదాన్నే ఉన్నాను. చాలా మంచి అనుభూతి కలిగింది. డాడీ బర్త్‌డే రోజు మందిరం ఓపెన్ చేయడం, నా బర్త్‌డే రోజు ఇలా నాకు ప్రత్యేకంగా దర్శనమివ్వడం నాకు ఎంతో పర్సనల్‌గా అనిపించింది. అత్యంత అరుదుగా లభించే ఇలాంటి దర్శనం నా మటుకు నాకు అద్భుతంగా తోచింది.

బాబా నన్ను అంతసేపు తన దగ్గరే ఉంచుకున్నా నాకు బాబాను అడగడానికి, కోరడానికి ఏమీ లేవు. ఇప్పుడే కాదు, ఎప్పుడూ కూడా నాకు అలాగే ఉంటుంది. అందుకని ఆ సమయంలో నా మనస్సుకు నచ్చిన అందరికీ, తెలిసిన వాళ్ళకి, మన సాయికిడ్స్‌కి, పెద్దగా పరిచయం లేని వాళ్ళతో సహా అందరికీ బ్లెస్సింగ్స్ ఇవ్వమని ప్రపంచమంతా ఆనందంగా ఉండాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నాను. జరగబోయే మన ఫంక్షన్స్ విజయదశమి, ఆరాధనకు బ్లెస్సింగ్స్ అడిగాను. అంతేకాదు, నేను బుక్ చేసుకున్నది ఒక్క దర్శనమే అయినప్పటికీ, ఒక ఊహించని సంఘటన వలన నాకు మరొక దర్శనం కూడా లభించింది. నా పుట్టినరోజున బాబా తమ దగ్గరకు రప్పించుకుని ఎంతో కృపతో నన్ను ఆశీర్వదించారు.

**– సాయినాథుని శృతి**



సందర్భములలో తమకున్న జ్ఞానము మరుగునపడి యుండును. అట్లని అది జీవితాంతము కాదని గుర్తుండవలెను. కేవలము ఆయా మానసిక పరిస్థితులను బట్టియే ఇట్టి వికారములు మనస్సునకు కలుగుచుండునని గుర్తుండుట కూడా సాధనలోని భాగముగనే ఎరుగవలెను. పశ్చాత్తాపబుద్ధి కలవానికి, అట్లే తమను తాము సంస్కరించుకొను సద్బుద్ధియున్న వారికి ఏ కారణము చేతనైననూ వారి మనస్సు వికారము చెందినను, భ్రమలకు లోనైనను ఇట్టి వారు సదాభ్యాసబలము చేతను లేదా దైవస్మరణ చేతను లేదా సద్గురువుల ఉపదేశమును మననము చేయుట చేతను, కోరి ప్రశాంతను ఏర్పరుచుకొందురు. పరిస్థితులు, కాలము అనుకూలించనపుడు మౌనము వహించుదురు. ఇట్టి సాధనమున మనస్సు మరల యథాస్థానమున ఉండుటకు సాధ్యపడును. ఇట్టి వారి వలనగాని, వారి మాటల వలనగాని, లేదా చేతల వలనగాని ఇతరుల మనస్సును నొప్పించినచో లేదా వారికి వీరి వలన కష్టము కలిగినచో వెను వెంటనే వీరు తమ వలన జరిగిన పొరపాటును గుర్తించెదరు, జరిగిన పొరపాటులను సరిదిద్దుకొనుటకు వెనుకాడరు. ఇట్టి సాధకులు సామాన్యముగా దేనికిని జంకరు.

తమ తప్పులను, తమ వక్రమైన ఆలోచనలను కప్పిపుచ్చుకొను ప్రయత్నము చేయువారు, అట్లే తమకన్న చిన్నవారిపై, అమాయకులపై తమకున్న తెలివితేటలను ప్రదర్శించువారు ఆత్మానందము పొందుటకు నోచుకొనలేని వారని గ్రహించవలెను. ఇతరులను బుద్ధిపూర్వకముగా దుఃఖపెట్టు స్వభావము కలవారు వారి ఆలోచన విధానమున, వారి క్రియాదుల వలన ఇతరులకు నష్టము కలిగించుచుందురు. ప్రత్యేకించి సజ్జనులకు, ఆధ్యాత్మిక సాధకులకు అంతరాయములు కల్పించు దుష్టబుద్ధి ఉన్నవారు తాము సుఖపడరు. ఇతరులను సుఖపెట్టలేరు. కనుక ఇట్టి విషపూరితమైన అభిప్రాయములకు సాధకులు సుదూరముగా నుండుటకు ప్రయత్నించినచో గమ్యమును సవ్యముగా చేరగలరు.

అన్ని సమయములు అనుకూలముగా ఉండకపోవచ్చును. కొన్ని సమయములలో ప్రతికూల పరిస్థితులే ఎదురగుచుండవచ్చును. తమకు బొత్తిగా ఇష్టము లేని వ్యక్తులు, సన్నివేశములు తారసపడవచ్చును. ఇట్టి పరిస్థితులలో చికాకు, చిరాకు మనస్సున చిందులు త్రొక్కుచుండును. అట్లే భక్తులమైనా, సాధకులమైనా, సజ్జనులమైనా మనకు ఇట్టి పరీక్షలేల? అని సందేహాస్పదముగా ప్రశ్నలు మనస్సుల తలెత్తుతుండును, సాధకులు కూడా మానవులేనని, కనుక వారికి కూడా కష్ట నష్టములు సంభవించుచుండునని గుర్తుండుట మంచిది. మహాపురుషులు, మహాత్ములు ఇట్టి వారనేకమంది





జీవితం కాగడాలా వుండాలి. ఎవరికైనా ఉద్యోగం ఇప్పిస్తే, వెనుకటి రోజుల్లో "మా ఇంట్లో దీపం వెలిగించారు" అనేవారు. మాకు మహోపకారం చేసారు, జీవితం నిలబెట్టారు. అన్న దానిని "దీపం పెట్టారు" అన్న దానితో పోలుస్తున్నారు మన పెద్దలు. కనుక మన జీవితాలు దీపాలుగా వుండాలన్న ఆశ, ఆశయం, ఆకాంక్ష ఆ మాటలో వ్యక్తం అవుతున్నది. అలా వారి మాటలోనే వారి హృదయం చూడగలగాలి, అది నిజదర్శనం అంటే.

భాగవతం వింటాం. దానిలో బాలకృష్ణుడి చేష్టలన్నింటిని లీలలంటాం. విని ఆనందంగా వుంది పుణ్యం వస్తుంది అంటాం. అదే మన ఇంట్లో పిల్లవాడో, పక్కింటి పిల్లవాడో అలా చేస్తే మనం భరించి ఊరకుంటామా? మరి భాగవత శ్రవణాన్ని మనం నిత్య జీవితంలోకి తెచ్చుకున్నామా అంటే సందేహమే. **"భాగవతం వింటే పుణ్యం అనే భావనలో వింటామే గానీ, సరిగా శ్రవణం చేస్తే "మనం బాగవుతాం"** అన్నది తెలియాలి. ఆ 'బాగు' ఎలా అవుతాము అంటే, ఆ విన్నదానిని నిత్య జీవితంలోకి తెచ్చుకొని, ఆచరిస్తేనే అప్పుడు మన మనసులోనికి శ్రీకృష్ణుడు దిగివచ్చినట్లు. ఈ దృష్టి, దృక్పథం లేకపోతే దివి నుండి భువికి ఆ భగవానుడు మన జీవితంలోకి, మనలోకి, మన ఒంట్లోకి, మన ఇంట్లోకి, అలా సమాజంలోకి, జీవనంలోకి దిగిరాలేడు. మనం అలా చేసినప్పుడే ఆయన మన జీవితంలోనికి, మనలోనికి, మన ఒంట్లోకి రాగలుగుతాడు. మన ఇంట్లోకి వచ్చిన ఆ భగవానుని అలా మన చుట్టూ ఉన్న వారికి అందించడమే పంచడం అంటే. ఈ పంచడం వలన మనలో అది పెరుగుతుంది అంటే... అలా నీ చుట్టూ వ్యాప్తి పొందిన దానిని నిరంతరం చూడగలగడం. అది పెరగడం అన్నా, ఎదగడం అన్నా, పెంచుకోవడం అన్నా, అంతటా అన్నింటా వున్న ఆయన్ను చూసే నేర్పు, సులువు మనకు అందిరావడమే. ఇదే అభ్యుదయమంటే. మనం ఎదిగిన దానికి గురుతు. సద్గ్రంథాలు, ఇతిహాసాలు, రామాయణం, భారత, భాగవతం, మహాత్ముల చరిత్రలు ఇవన్నీ మనం చదువుకోవడంతో ఆగక జీవితంలోకి అన్వయించుకొని, సమన్వయించుకొని ఆచరిస్తూ, అనుసరిస్తూ, అనుభూతినొందాలి. ఆ సద్గ్రంథాల పరమార్థం అందుకుంటే – **సాధనలో జీవితం భాగం అవ్వడానికి అవకాశం కలుగుతుంది.**

ఓసారి మాస్టర్ ఇ.కె.గారు ఓ పల్లెలో రామాయణం గురించి మాట్లాడిన విధానం – రామాయణ పాత్రలను వారి హృదయాలలో నిలపడానికి, వారి నిత్యజీవనకృత్యంలోని సంఘ సన్నివేశాలలో చెప్పడంతో ఆ పాత్రల ఔన్నత్యం, తత్వం... వారి హృదయాలలో నిలిపి, నిత్యం చేసారు. ఇది సద్గురుని నేర్పు. **శ్రీరాముడిని** నీలమేఘునిగా, దున్నినభూమిని **సీత**గాను, తొలకరిజల్లును **సీతారాముల**



**కళ్యాణం**గాను, మొలకలను **కుశలవులు**గాను, పాడిపంటలను పోషిస్తూ, సంసారిగా ఉంటూనే ఆధ్యాత్మికంగా జీవించేవాడిని **జనకుడి**గాను, ఇలా ఎన్నో ఉదాహరణలతో అటు వ్యవసాయాన్ని, ఇటు **"అవి కల్పనలు కావని, సత్యాలని"**, అవి **"అసాధ్యాలు కాదని, సాధ్యాలని", ఆ మహాత్ముల జీవితాలే నిదర్శనాలుగా, నిరూపణలుగా మనకు చూపిన బాట, అంటే ఆ వాక్యం వెనుకనున్న వారిని దర్శించాలి.** అది మన లక్ష్యం కావాలి. అది మన దృక్పథం కావాలి. అట్టి దృష్టితో చదవాలి, చూడాలి, ఆచరించాలి అనుభూతినొందాలి, అనుభవాన్ని అంటిపెట్టుకోవాలి. ఇదే మార్గం... ఇదే గమ్యం. బాబా చరిత్రలో మనకు కనిపించే అన్ని లీలలలోను మనం రోజూ చూస్తున్నవే, వాడుకుంటున్నవే, తింటున్నవే, చేస్తున్నవే. అవి జరిగేప్పుడు మనకు ఆ లీలలు గుర్తు రావడం ద్వారా మనల్ని మనం సరిదిద్దుకుంటూ, చక్కదిద్దుకుంటూ, తీర్చిదిద్దుకోవడం.ఇది బాబా చరిత్ర పారాయణ, లీలల శ్రవణ మననాదుల ఫలాలు.

ఆచరణలో ఆనందం, ఉత్సాహం తొంగి చూసిన క్షణాలే మనం జీవించిన క్షణాలు. ఇది నిత్యం మనం చేయవలసిన పని. ఈ పనిలో మనం అలసిపోవడం, నలిగిపోవడం, కుమిలిపోవడం ఉండదు. ఎందుకో తెలుసా... ఇక్కడ మనం స్వార్థాన్ని వదిలేసుకొని, పదిమంది కోసం కలిసి పనిచేసాం. పరుల కోసం పాటుపడుతున్నాం కాబట్టి. మనకు కావలసిన ప్రాణశక్తిని ఆ పరమాత్ముడే మనకు అందిస్తున్నట్లు అవసరమైనవి అందిస్తుంటారు. ఈ ఎరుక మనలో నిలవాలి నిత్యం. అప్పుడు ఆ దివ్యచైతన్యపు వెలుగులో అందరం ఆనందమయమైన మార్గంలో పని చేస్తుంటాం. ఇలాంటి చోట మన **వ్యక్తిత్వాలు** పనిచేయవు. అదే దివ్యసాన్నిధ్యం. ఇక్కడ మన ద్వారా పని జరగడం ఉంటుందిగాని, మనం చేయడం వుండదు. వీటినే యజ్ఞాలు అన్నారు ఋషులు. నిత్యం ఇలాంటి యజ్ఞాలలో పాల్గొనడం వలన మన జీవితమే యజ్ఞంగా మారిపోతుంది. ఈ యజ్ఞఫలాన్ని ఎదుటివాడు ఆనందరూపంలో అనుభవిస్తాడు. అంటే నీ కర్మ ఆనందానికి దారి చూపించింది

**“అసత్యం చెప్పవద్దు. ఇవ్వడం ఇష్టం లేకపోతే కారణం చెప్పు” అన్నారు సాయి.**

**శిక్షణ-రక్షణ :** ఒకసారి తెలుగు డిపార్టుమెంట్‌లో ఉండగా, ఒక ప్రముఖ కవి శతజయంతి ఉత్సవాల నిమిత్తం విరాళాల కొరకు కమిటి వారు వచ్చి అడుగగా “నేను నా జీతంలో కుటుంబ సభ్యుల ఖర్చులకు పోను, మిగిలిన డబ్బుతో హోమియో మందులు కొని పేదలకు ఇస్తూ వుంటాను. మీరు చేస్తున్న పని కంటే నేను చేస్తున్న పని విలువైనది అని నేను భావిస్తున్నాను. అందుచేత మీకు విరాళం ఇవ్వను” అని ఖండితంగా, నిర్మోహమాటంగా చెప్పారు మాస్టరుగారు. ఇది మనకు బాబా





నుండి సద్గురుప్రేమ మనకు అనుభవమవుతుందని... మనం సద్గురువులో భాగమే అన్న ఎరుక స్థిరమయ్యే కొలది... మనలో ఆనందం స్థిరమవుతుంది. భక్తుల అనుభవాలను మనందరితో పంచుకుంటూ, ఆ అనుభవ నేపథ్యంలోని సద్గురు మహిమను వర్ణిస్తూ, సద్గురువుపట్ల ప్రేమను పెంపొందిస్తూ, పరిణతిని ఇస్తూ, పరివర్తన తెస్తూ, మనం సద్గురువులో భాగమన్న ఎరుకను స్థిరం చేస్తూ, మన ఆనందానుభవాలకు ఆలవాలమయింది – ‘గురుకృప’.

**గురుకృపావర్షం నిరంతరంగా కురుస్తూనే ఉంటుంది. గురుకృప అక్షరయజ్ఞం నిర్విరామంగా కొనసాగుతూనే ఉంటుంది. సద్గురు మహిమను, ప్రేమను గగనదిగంతాలలో కీర్తిస్తూ... ప్రతి అక్షరం హృదయం ప్రతిస్పందించేలా... ప్రతి దిక్కులో ప్రతిధ్వనించేలా... సద్గురుచరితను పదిలంగా దాచుకుంటూ... ప్రతి పదంతో సద్గురు పదార్చన చేస్తూ... అనంతంగా... అజరామరంగా...**

– **ఉపేంద్ర**, చెన్నై

## మనస్సు

మనస్సు చంచల మగుచుండుటకు, వికలము చెందుటకు, మనస్సున నిరుత్సాహము కలుగుటకు, కలత చెందుటకు అసలు కారణములను అలజడి చెందక సాధకులు నెమ్మదిగా గమనించుట నేర్చుకొనవలెను. సామాన్యముగా తమ తోటివారు, తమ బంధుమిత్రులు, తమ కుటుంబ సభ్యులు లేదా వారు పనిచేయుచున్న వివిధ సంస్థలకు చెందిన వారు, లేదా సహోద్యోగులు మొదలగువారి కారణములుగనే అనేక సమస్యలు లేదా విఘ్నములు లేదా కష్టములు కలుగుచున్నవని నమ్మబుద్ధి పుట్టును. అంతటితో ఊరుకొనక వారిపై రకరకముల అభిప్రాయములను కల్పించుకొనుచుందురు, తమ మనస్సున తీవ్రమైన భావములను ఏర్పరచుకొనుచుందురు. వారిని చూచినంతనే మనస్సులో వారిపై తమకున్న రకరకముల భావములు గిరగిర తిరుగుచుండును. ముఖకవళికలు మారిపోవును. సంభాషణయందు మార్పు కనబడును. బొత్తిగా నచ్చనివారు తారసపడినచో ముఖము చాటు చేసుకొనుచుందురు. వారి సమాధానములు అడ్డదిడ్డముగా నుండును. మాటయందు సౌమ్యత ఉండదు. చూపునందు తేడా స్పష్టముగా కనబడును.

అంతరంగమున కక్ష, కసి పాతుకొని యున్నచో మనస్సున ఉద్రేకపూరితమైన భావముల వేగము తీవ్రమగుచుండును. ముఖము కందిపోవును. ఆయా సమయాదులలో తాము ఆర్జించిన జ్ఞానము గుర్తుకు రాకుండును. అనగా అజ్ఞానము ఆవరించియుండును. తాము చేసిన సద్గ్రంథపఠనాదుల ఫలము, పూజా పునస్కారముల ప్రభావము మాయమయ్యేనా? అనిపించును. అనగా ఆయా



చూపడం... మనస్సు, మాట, చేతలు – ఇలా మూడు అరుదైన సమన్వయంతో సద్గురుతత్వంలో అలరారుతాయి. అందుకే శ్రీబాబూజీ పలికే ప్రతిమాట, సత్యానికి ప్రమాణమై, అత్యంత శక్తివంతంగా మన హృదయాంతరాళాలలోకి చొచ్చుకుపోతుంది. అందుకే శ్రీబాబూజీ సత్సంగభాషణాలు భక్తుల హృదయాలను చేరతాయి. శ్రీబాబూజీ ఆచరణను స్ఫూర్తిగా తీసుకొని, శ్రీబాబూజీకి సంబంధించి అప్పటివరకు ప్రపంచానికి తెలియని ఎన్నో విషయాలను, అనుభవాలను సేకరించి, సద్గురుతత్వ అగాధ రహస్యాలను వెలికితీసి అందించిన సుజ్ఞాన సర్వస్వం – 'గురుకృప'.

శ్రీబాబూజీ ప్రేమ ఎందరో భక్తుల కన్నీటిని తుడిచింది. బాధలను తొలగించింది. కోరికలను తీర్చింది. ఆశయాలను నెరవేర్చింది. జీవితాలకు ఊపిరిలూదింది. పరిణతిని ప్రసాదించింది. ప్రేమను జ్వలింపజేసింది. తమ నుండి ఏమి ఆశించకుండా, తమ జీవితాలలో ఆనందాన్ని నింపిన శ్రీబాబూజీ పట్ల భక్తులకు ఎంతో ఆరాధన, ప్రేమ. సద్గురువుపట్ల ప్రేమ పెరిగేకొలది సద్గురువు గురించి, సద్గురు స్వరూప స్వభావాల గురించి తెలుసుకోవాలనే తపన మొదలు అవుతుంది. సద్గురు స్వరూపాన్ని తెలుసుకునే క్రమంలోనే మన స్వరూపం గురించి మనకు తెలుస్తుంది. అది ఎలా? సద్గురువు సజీవ దర్పణం లాంటి వారు. సద్గురువు అనే దర్పణంలో మనకు కనిపించేది మన స్వభావమే అంటారు శ్రీబాబూజీ. సద్గురువు అనే అద్దం విషయానికి వస్తే సద్గురువు మనలో ఏ మార్పు రావాలో తెలియజేసి, ఆ మార్పు రావడానికి తోడ్పడుతూ, మనం ఆ మార్పును సాధించడానికి కూడా సద్గురువు కారణభూతులవుతున్నారు. సద్గురువు మనలోని దోషాలను చూపడమే కాదు. వాటిని తొలగిస్తారు కూడా – అని వివరించారు శ్రీబాబూజీ. సద్గురు పదసన్నిధిలో మనకు మనమే సరిక్రొత్తగా పరిచయమవుతాం. మనలోని భావాలు, ఆలోచనలు, మన ప్రవర్తన, ఒక సంఘటన ఎదురు అయినప్పుడు దానికి ప్రతిస్పందించే విధానం – ఇలా ప్రతి విషయంలో మనకే తెలియని పరివర్తన మనకు సద్గురుతత్వాన్ని తెలుసుకునే క్రమంలోనే వస్తుంది. ఆ మార్పు ఎందాకా... మనం వారంతటి వారం అయ్యేంత వరకు... ప్రాపంచికమైన కోరికలు తీరడం కావచ్చు, సమస్యలు సమసిపోవడం కావచ్చు, ఆధ్యాత్మికమైన అనుభూతి కావచ్చు – ఇలా సద్గురువు ప్రసాదించిన ప్రతి అనుభవం మనలో ఏదో ఒక మార్పును ప్రేరేపిస్తూ పరివర్తన తెస్తుంది. ప్రతి అనుభవం మనకు ఒక విషయాన్ని గుర్తు చేస్తూనే ఉంటుంది. మనం చూసే ఈ ప్రపంచం, పరిసరాలు, ప్రకృతి, మనమందరం – ఈ సమస్తం సద్గురువులోని భాగమే అని. ప్రతీదీ సద్గురు సంకల్పానుసారంగా స్పందిస్తుందని... వీటన్నింటి





చెప్పిన, చూపిన మార్గం.

**"ఒక మంచి విషయాన్ని ఎన్నిసార్లైనా వినాలనే మంచితనం మనజాతిలో లేదు".** ఓసారి మాస్టర్‌గారి ప్రవచనం ఓ చోట జరుగుతుంటే వెళ్ళినవారిలో ఒకరు బస్‌లోనే ఉండిపోయాడట, అంతా అయ్యాక, "మాష్టారు! మీరు ఎప్పుడూ చెప్పిందే చెబుతూ ఉంటారు అందుకే నేను రాలేదు" అన్నాడట. వెంటనే మాష్టారు **"తప్పునీది కాదు. మన సివిలైజేషన్‌ది. ఒక మంచి విషయాన్ని ఎన్నిసార్లైనా వినాలనే మంచితనం మన జాతిలో లేదు"** అన్నారట. మాతో వచ్చిన మా కాలేజీ లెక్చరర్ టేప్‌రికార్డర్ తెచ్చుకోనందుకు వర్రీ అవుతున్నానని మాష్టారుతో అంటే "మీరు వర్రీ అవుతుంటే నేను ఫెయిల్ అయ్యాననన్నమాట" అని వెంటనే చురకవేసారు, ఆ జాగ్రత్త నేర్పలేనివాడినని, సరిగా వినేలా చేయలేకపోయానని. వెలితి లేకుండా విన్నది కొంచెమైనా అనుభూతి పొందగలిగాలి కదా, మరలా మరలా మిగతాదాన్ని అందించకుండా వుండరన్న వివేకం మాష్టారి పట్ల కలగలేదంటే అది తమ తప్పుగానే భావిస్తాను అన్న మాటల్లో మన బలహీనతల్ని మన అలసత్వాన్ని తనపై వేసుకొని, (మీ భారాలను మోయడానికి సిద్ధంగా ఉన్నాను అన్న అభయం) తన బిడ్డలో పరివర్తనకు ఎదురుచూసే సహనమూర్తి. "సాయివంటి దైవంబు లేడోయి, లేడోయి" పుట్టుకలో గురుదేవుల మాతృత్వం వెల్లడయిన విధానం మనందరం ఎరిగినదే. అందుకే గురువును తల్లి, తండ్రి, దైవం,సర్వం అన్నది. **– గురుకృప**

## అయాచితంగా అందుకునేదే అనుగ్రహం

తేది 2-1-99 రాత్రి 1.15 గంటలకు గురువుగారి సన్నిధిలో చక్కని సత్సంగం జరిగింది. గురుబంధువులు కొందరు ఉత్సాహ పూరితమైన ప్రశ్నలు అడగ్గా గురువుగారు ఎంతో రసభరితంగా వాటికి సమాధానం ఇచ్చారు. గురువుగారి రాకకోసం సత్సంగహాలులో గురుబంధువులు ఎదురుచూస్తున్నారు. గురువుగారు హాల్లోకి వచ్చి 'బాబా'కు నమస్కారం చేసి కూర్చున్నారు. ఏదో తెలియని దివ్యానుభూతిని వారు పొందుతున్నందున నోటినుండి మాట రావటం లేదెవ్వరికి. కొద్దిసేపటిదాకా నిశ్శబ్దం అలుముకుంది.

**గురువుగారు :** ఊ! చెప్పండయ్యా, అని మధురాతి మధురమైన స్వరంతో అన్నారు గురువుగారు. గురువుగారు చక్కని సదవకాశాన్ని కల్పించినా, ఉపయోగించుకోకపోతే నష్టపోయేది మనమే. అడగాలి... అడగాలి... అనే వారేగాని అడగండయ్యా అని అవకాశమిచ్చేసరికి అడక్కపోతే ఎలా? ఎవ్వరూ అడక్కపోయేసరికి ఆ అవకాశాన్ని చేజార్చుకోవడం ఇష్టంలేక కందుకూరి సుధాకర్‌గారు ప్రశ్న అడిగారు.



**సుధాకర్ :** సత్యాన్ని అంటిపెట్టుకో అని బాబా అన్నారు కదా! సత్యాన్ని అంటిపెట్టుకోవటమంటే ఏమిటి?

**గురువుగారు : సత్యాన్ని అంటిపెట్టుకోవడమంటే, ఎల్లవేళలా సత్యాన్ని పలకడం. బాబా ఉన్నారు అనే సత్యాన్ని ఎల్లప్పుడూ ఎరుకలో ఉంచుకొనటమే సత్యాన్ని అంటిపెట్టుకోవడమంటే** (గురుబంధువులు అడిగిన మరికొన్ని ప్రశ్నలు)

**ప్రశ్న :** మా సద్గురువు మీరే కదా! మీ దగ్గరనుండే కదా మాకేదైనా రావలసింది. నెమ్మదిగా, వినయంగా అడిగారు.

**గురువుగారు :** కొద్దిసేపు నిశ్శబ్దం... చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దం అది. (బాబా ఫోటోవైపు చూపుతూ) మనందరి సద్గురువు ఆయనే కదా! ఈ ప్రశ్న, సమాధానం వినేసరికి (మెరుపు, వెనుకలకు వెళ్ళాను) ఫ్లాష్‌బాక్... భగవాన్ సన్నిధిలో కొందరు భక్తులు, **మీ ఆకర్షణశక్తే కదా ఇంతమందిని ఆకర్షించేది** అనేసరికి! భగవాన్ వారినుద్దేశించి, మరి **'భగవాన్‌ను ఆకర్షించిన శక్తి ఏది?'** అని ఎదురు ప్రశ్న వేసారు.

**ప్రశ్న :** ఒకానొక సందర్భంలో బాబాకు తమ భక్తులు చేసుకునే సేవలో ఇతరులెవరైనా మధ్యలో కల్పించుకుంటే! ఎందుకనో బాబా తమని తాము అతిగా శిక్షించుకునేవారు. ఎందుకని? గురుబంధువులు దీనిలోని ఆంతర్యం తెలుసుకోవాలని వారే సందర్భాన్ని వివరించారు. ఒక భక్తురాలు మశీదులో బాబాకు నడుము పిసుకుతుంటే, ప్రక్కనే ఉన్న కాకాదీక్షిత్ "మెల్లగా ఒత్తు. బాబాకు నొప్పి పుడుతుంది" అన్నారు. వెంటనే బాబా అధికమైన కోపంతో లేచి మసీదులో ఉన్న స్తంభానికి సటకాను అదిమిపట్టి తన పొట్టలోనికి గుచ్చుకున్నారు కదా! అని వివరణాత్మకమైన ప్రశ్నను వినిపించారు.

**గురువుగారు :** మనం బాబాని కష్టపెట్టలేము. అలాగని సుఖపెట్టలేము. ఆ భక్తురాలు అంత గట్టిగా నడుం ఒత్తుతుందే నొప్పి పుడుతుందని కాకాదీక్షిత్ అన్నప్పుడు బాబా వెంటనే సటకాను కడుపులో గుచ్చుకున్నారు. సటకా కడుపులో గుచ్చుకున్నపుడే నొప్పిగాని, బాధగాని అనిపించని బాబాకు నడుం పిసుకుతుంటే నొప్పి పుడుతుందా? కాకాదీక్షిత్‌కు తెలియచేయడానికి బాబా ఈ చర్యను చేసారు.

**ప్రశ్న :** కర్మఫలం నశించాలంటే శిరిడీలో ఉంటే సరిపోతుందా?

**గురువుగారు** : శిరిడీలో ఉంటే సరిపోతుంది.

**ప్రశ్న :** శిరిడీలో ఉండి మేమేం చేయాలి గురూజీ?

**గురువుగారు :** మనం బాబా కోసం వచ్చాం. మనం బాబా సన్నిధిలో ఉన్నామన్న ఎరుకలో ఉంటే





శ్రీసాయియే సర్వస్వంగా అకుంఠిత దీక్షగా సాగిన సాధన, ఓ తపస్సై శ్రీబాబూజీని ఆధ్యాత్మికంగా మహోన్నత శిఖరాలను చేర్చింది. చూసేవాళ్ళకి కఠోరసాధనగా అనిపించినా, వాస్తవానికి అది తమ ఇష్టదైవం పట్ల ఉన్న అవ్యాజమైన ప్రేమే. అంతటి ప్రేమ ఎలా ఉంటుందో శ్రీసాయి తమ గురువు గురించి ప్రస్తావిస్తూ చెప్పిన వర్ణనలో అవగతమవుతుంది. "నా గురువు పరిపూర్ణులు. వారు ప్రేమావతారమని చెప్పవచ్చును. ఆ ప్రేమను నేనెట్లు వర్ణించగలను? వారు నన్ను ఎంతగానో ప్రేమించే వారు... నిరంతరం ధ్యానంలో ఉన్న వారిని తదేకంగా చూస్తుండే వాడిని... నా కనుపాపల యందు ఆ రూపం లేనప్పుడు ఆ కళ్ళు లేకపోతేనే మేలనిపించేది. రాత్రింబవళ్ళు ఆకలిదప్పులు మరచి నా గురువునే తన్మయంగా చూస్తుండే వాడిని... నా మనస్సు ఎల్లప్పుడు వారియందే ఉండెడిది...." అని తమ గురువును ఎలా సేవించారో శ్రీసాయిబాబా తెలిపారు. అలానే శ్రీసాయి పట్ల అనన్య ప్రేమతో శ్రీబాబూజీ సాగించిన సాధనాప్రయాణం, ఆ సాధనా రహస్యాలను తేటతెల్లగా వ్యక్తీకరించిన విధానం – ఆధ్యాత్మిక ప్రపంచానికి అవి జ్ఞాన భాండాగారాలు. ఆ జ్ఞాన సంపదను అందించడానికి సద్గురు దివ్య ఆశీస్సులతో సాగించిన అవిరళకృషి, ఓ మహా అక్షరయజ్ఞం – ఈ 'గురుకృప'.

"దున్నపోతు ఎక్కి నాన్నెఘాట్‌లో సవారి చేస్తూ దాటటం కంటే ఈ మార్గం ప్రయాసకరమైనది. ఈ ఆధ్యాత్మమార్గం ఎంతో కఠినమైనది. దీనికి ఎంతో కృషి అవసరం", "గమ్యాన్ని చేరడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. ఇక్కడ నుండి ఒక మార్గం ఉంది. ఈ మార్గంలోనూ అడ్డంకులు ఉన్నాయి. అయితే మార్గదర్శి తోడుంటే సునాయాసంగా గమ్యాన్ని చేరవచ్చు" అని సద్గురు ఆవశ్యకతను తెలిపారు శ్రీసాయిబాబా. బాబా చూపిన ఆ పథం, శ్రీబాబూజీ ఆచరించిన చూపిన సాయి మార్గం – సాయిపథం. మార్గంలో ఉండే మూఢనమ్మకాలు, దురాచారాలు అనే అవరోధాలను తొలగించి, సరళమైన ఆనందపథాన్ని శ్రీబాబూజీ మనకు అందించారు. శ్రీబాబూజీ ఆచరణ, ప్రబోధం, శ్రీబాబూజీ కలం నుండి జాలువారిన అద్భుతమైన వ్యాసాలు, వారి అమృత సత్సంగ భాషణలు సాయిపథానికి మార్గదర్శకం కావించాయి. సద్గురుతత్త్వాన్ని మహోన్నతంగా ప్రవర్తిల్లజేసిన ఆ విలక్షణ వ్యాసాలు శ్రీసాయికి అలంకరించిన సాహితీ సుమహారాలు. ఆధ్యాత్మిక ప్రపంచానికి ఆనందపథాన్ని చూపుతూ, జ్ఞాన సంపదను పరిప్లవించిన శ్రీబాబూజీ సత్సంగ భాషణలు సుజ్ఞాన నిధానాలు. మనసా, వాచా, కర్మణ త్రికరణ శుద్ధిగా – అంటే ఏది మనస్సులో ఉందో అదే మాట్లాడడం, దానినే ఆచరించి



శ్రీబాబూజీ దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు తన మనో దౌర్బల్యాన్ని, తాను చేసిన చెడు పనులను, బలహీనతలను ఏకరువుపెట్టి, తాను వాటి నుండి బయటపడలేకున్నానని, తన మీద తనకు అసహ్యం కలుగుతోందని, బాబాకు, మీకు దూరమైపోతానేమో అని బాధగా ఉందని వెక్కి వెక్కి ఏడ్చారు. శ్రీబాబూజీ ఆ వ్యక్తిని అనునయించి ప్రేమగా… సత్సంగానికి అటెండ్ అవుతూ వుండు. నువ్వు ఏమి చేసినా అది బాబాకు దగ్గర చేస్తుందా, దూరం చేస్తుందా అని ఒక్కసారి ఆలోచించుకో, నిజాయితీగా డైరీ వ్రాసుకోమని సూచించారు. సద్గురువు వాక్కు ఓ మంత్రమై ఆ భక్తుడిని ఆవరించి మనస్సులోని మాలిన్యాన్ని క్షాళన చేయనారంభించింది. కొన్ని రోజుల తర్వాత ఆ భక్తునికి ఒక కల వచ్చింది. కలలో ఆ భక్తుడు అచేతనుడై పడి ఉన్నాడు. శ్రీబాబూజీ అతని దగ్గరకు రాగానే ఆ భక్తుడు బిగ్గరగా అరిస్తే, 'నన్ను ఏంచేస్తున్నారు' అని లేవడానికి యత్నం చేయబోయాడు. కానీ శక్తిహీనుడై లేవలేకపోయాడు. అప్పుడు శ్రీబాబూజీ ఏదో జలాన్ని ఆ భక్తుని చుట్టూ చల్లి వెళ్లిపోయారు. చుట్టూ అగ్నిగుండం ఉన్నట్లు వేడి… ఉలిక్కిపడి లేచాడు. ఆ కల తర్వాత ఆ భక్తుడికి మనస్సులోని పీడ ఒక్కసారి తీసేసినట్లు అనిపించింది. ఎంతో హాయిగా, పవిత్రంగా ఉండి మార్పు కొట్టొచ్చినట్లు కనపడింది. "సమర్థ సద్గురువు తన దివ్యశక్తి చేత సాధకుని అంతరంగంలో పేరుకున్న మలిన వాసనలను కొన్ని దివ్య అనుభవాల ద్వారా నిర్మూలిస్తాడు. ఎన్నో జన్మల కఠోర తపస్సు చేసినా ప్రక్షాళనకాని ఎన్నో మలినవాసనలను సద్గురువు కేవలం తన కృపావిశేషంతో మటుమాయం చేస్తాడు" అని సద్గురు శక్తిమత్వాన్ని శ్రీబాబూజీ వివరించారు. తదనుగుణంగా అనుభవపూర్వకమైన నిదర్శనాలను ప్రసాదించారు. అలాంటి అనుభవ సుమాలను ఏర్చి కూర్చి శ్రీబాబూజీకి అలకరించిన అనుభవాల మాల, సద్గురువు – భక్తుని అనుబంధాల హేల – 'గురుకృప'.

బలహీనతలను జయించడమే సాధనల లక్ష్యంగా పెట్టుకున్నంత మాత్రాన అవి పోవని, వాస్తవానికి బలహీనతలను అధిగమించాలనే ప్రయత్నం – కూర్చున్న కొమ్మని నరుక్కోవడం లాంటిదే అని, సద్గురువు పట్ల మనలో ప్రేమ పెరిగే కొలది, పెరిగే కొలది బలహీనతలు పోవడం, వ్యక్తిత్వ వికాసం, సంస్కార పరిణతి కలగడం అనేవి ఉపఫలాలు (బై ప్రొడక్ట్స్)గా పొందడం జరుగుతుందని శ్రీబాబూజీ విశదపరిచారు. నిజాయితీగా, మనల్ని మనం వంచించుకోకుండా, మనమేమిటో తెలుసుకునే ప్రయత్నం చేయడం, మనల్ని మనం ఎదుర్కోవడం – అది నా దృష్టిలో అత్యంత సాహసోపేతంగా జీవనం సాగించడమంటే అని అంటారు శ్రీబాబూజీ.





ఇంకా తొందరగా మన కర్మ నశిస్తుంది. బాబా మనకి చెప్పిన సాధనాలేమిటో ఒకటి చెప్పండి. అని గురువుగారు ప్రశ్నించారు. మళ్ళీ మౌనం… గురుబంధువులంతా గురువుగార్నే చూస్తుండిపోయారు. ఒక్కటి కూడా లేదు గదూ! లేనే లేదు. ఉపాసనీబాబా శిరిడీకి వచ్చిన తరువాత **బాబాను నన్ను ఇక్కడ ఏమి సాధన చేయమంటారని** అడిగితే అందుకు బాబా ఇచ్చిన సమాధానమేమిటి? **రొట్టె, కూరముక్కలు తింటూ ఖండోబా ఆలయంలో ఉండమన్నారు.** అందువల్ల మనమేం చేయకున్నా, శిరిడీలో ఉన్నంత మాత్రాన మన కర్మ నశిస్తుంది. మీరు తిరుమలకు, తిరువణ్ణామలైకు అప్పుడప్పుడు వెళుతుంటారు కదా! కొద్ది రోజులక్కడ ఉంటారు కదా! అక్కడ కర్మ నశించదా? అని నన్ను అడగవద్దు. ఎందుకంటే నేను అక్కడకు వెళ్ళేది ప్రశాంతత కోసమేగాని, ఇక్కడి రద్దీ నుండి కొంత విశ్రాంతి కోసమేగాని, ఇతరం కోసం కాదు. అక్కడ కర్మ నశిస్తుందో లేదో నాకు తెలియదు, తెలుసుకోవాలనే జిజ్ఞాస కూడా లేదు. నాకేదైనా అనుభవం కలిగిందంటే అది బాబానే ఇస్తున్నారు.

**ప్రశ్న :** క్షేత్ర మహిమ బాగానే ఉంది సార్… శిరిడీలో ఎవ్వరైనా గతిస్తే మోక్షప్రాప్తి కలుగుతుందా?

**జవాబు :** చిరుదరహాసం చేసి ఊరుకున్నారు.

**ప్రశ్న :** సంయమనం అంటే ఏమిటి?

**జవాబు :** బ్యాలెన్స్

**ప్రశ్న :** గురూజీ, బాబా చరిత్ర చదివితే సాయిబాబా అనేది బాబా అసలు పేరు కాదు అనిపిస్తుంది. అలాంటప్పుడు బాబా నామం యొక్క ప్రాధాన్యత ఏమిటి?

**జవాబు :** నీకెందుకొచ్చింది ఈ "లా పాయింట్". బాబాని బాబా అని పిలిస్తే నీకేంటి అభ్యంతరం? నిన్నెవరైనా నీ పేరేమిటని అడిగితే నా పేరు ఫలనా! అని అంటావా లేదా? అలాగే బాబా కూడా ఆయన దగ్గరకు వచ్చిన కమీషనర్‌తో నా పేరిదని చెప్పలేదు. వీరంతా నన్ను 'సాయిబాబా' అని అంటారు. దీనికి నిదర్శనంగా ఒక భక్తుడు ఒకసారి రైల్లో బాబా నామాన్ని చెప్తూ ఉన్నాడు. మరుసటి రోజు భక్తుడు మసీదులోకి ప్రవేశిస్తుండగానే 'వీడు నన్ను రాత్రంతా నిద్రపోనీయకుండా పిలుస్తూనే ఉన్నాడు' అన్నారు బాబా అతన్ని ఉద్దేశించి. అంటే అతను రైల్లో కూర్చొని బాబా… బాబా.. అని అంటుంటే మసీదులో కూర్చున్న బాబాకు ఎలా తెలిసింది. ఆయన పలికారు గదా! మనమందరం కూడా బాబాని బాబాగానే పిలుద్దాం. ఆయన పలుకుతారు. ఇక్కడ బాబా నామం అంటే బాబా, బాబా అని పలకడమే.



**ప్రశ్న :** అంటే బాబా నామమే గదా మనకి మంత్రము!

**జవాబు :** నేను మంత్రాల గురించి, ఉపదేశాల గురించి మాట్లాడటం లేదు. **"రామ"** అనేది మంత్రమెలా అయ్యింది. అంటే అందులో బీజాక్షరాలు మొదలగునవి ఉన్నాయి. అది మంత్రం. ఉపదేశమంటే గురువు తన తపఃశక్తిని ధారపోసి దానిని శిష్యుని చెవిలో చెబుతాడు. 'బాబా, బాబా' అనేది మంత్రం కాదు. ఉపదేశం కాదు, **సాయిబాబా... సాయిబాబా.. అంటే ఆయన్ను పిలవడమే.**

**ప్రశ్న :** గురూజీ! సమర్థత అనేది శ్రద్ధవల్ల వస్తుందా? లేక అనుభవం వల్ల వస్తుందా?

**జవాబు :** (నవ్వులే... నవ్వులు...) ఈ రెండూ ఒకే విషయమునకు సంబంధించినవి ఎలా అవుతాయి. శ్రద్ధ, అనుభవం ద్వారా సమర్థత వస్తుంది, ఏమి ప్రశ్నయ్యా.

**ప్రశ్న :** గురూజీ... పూర్వజన్మ కర్మఫలం ఉంటుందా?

**జవాబు :** ఉంటుంది. కొద్దిపాటి నిశ్శబ్దం తరువాత... తప్పకుండా ఉంటుంది. తల్లిదండ్రులు చేసిన కర్మలననుసరించి మనకు ప్రతిఫలం ఉంటుంది అనేది కర్మ సిద్ధాంతం. అంటే మనం పాపం చేస్తే ఒక రకమైన ఫలితం, పుణ్యం చేస్తే వచ్చే ఫలితం వేరువేరుగా ఉంటాయి. దీనిని కర్మ సిద్ధాంతమని అంటారు. ఇది ఒక విధానమైన సిద్ధాంతం. ఒక వస్తువు జారితే క్రింద పడుతుంది. ఇది న్యూటన్స్‌లా, భూమి యొక్క ఆకర్షణ శక్తి వలన ఆ వస్తువు క్రింద జారి పడుతుంది అని ఒక సిద్ధాంతం. కానీ ఒక వస్తువును పై నుంచి క్రిందకు పడేసి మధ్యలో పట్టుకుంటే దానినేమంటారు? మామూలుగా కర్మఫలాన్ని అనుభవించవలసిందే. కాని సద్గురు సాయిబాబా అయితే మాత్రం ఆ కర్మను నశింపచేస్తారు. అనుభవించకుండా ఆ కర్మ నుండి మనలను కాపాడుతారు. అది ఆయన బాధ్యత.

**ప్రశ్న :** గురువుగారి 'గ్రేస్' (అనుగ్రహము) పొందాలంటే ఏమి చేయాలి సార్?

**జవాబు :** ఏమీ చేయకుండా పొందేదే గ్రేస్ అవుతుంది కాని, ఏదో చేస్తే పొందేది 'గ్రేస్' ఎలా అవుతుంది. **ఏమీ చేయకుండా, ఉచితంగా, అయాచితంగా పొందేదే 'గ్రేస్' అవుతుంది.** నీవు వ్రాసిన పరీక్షలో 50 మార్కులకు సమాధానాలు వ్రాసిన తరువాత నీకు 50 మార్కులు వస్తే అది గ్రేస్ ఎలా అవుతుంది. 20 మార్కులకు మాత్రమే సమాధానాలు వ్రాసి, 50 మార్కులు పొందితే 30 మార్కులు గ్రేస్ అవుతాయి. **ఏమీ చేయకుండా పొందిందే 'గ్రేస్' అవుతుంది.** గురువు అనుగ్రహం పొందాలంటే నీవేమీ చేయనక్కరలేదు. ఆయనకు నీమీద ప్రేమ కలిగితే 'గ్రేస్' దానంతటదే వస్తుంది. ఉదాహరణకి నాకు నీమీద చాలా ఇది ఉండి ఒక పదిరోజులు శిరిడీలో ఉండమన్నాననుకో. దీనికి నీవేమంటావు?





వారు. మన ఆలోచనా విధానాన్ని సరిచేస్తూ, సంస్కరించిన సంస్కర్త. భక్తుల బాధలను సావధానంగా ఆలకించి ఒక్క మాటతోనే, ఒక్క చూపుతోనే తొలగించిన మహిమాన్వితులు. మనస్సును ఉక్కిరిబిక్కిరి చేసే సమస్యల మూలాలను పెకలించి, సమసిపోయేట్లు చేసి, ఆవరించిన కారుచీకట్లను తొలగించిన సద్గురు చంద్రుడు, శ్రీసాయిమార్గమనే ఆనందపథ నిర్దేశకులు – శ్రీబాబూజీ. శ్రీబాబూజీతో భక్తులకు ఉన్నది ఎంతటి అనుబంధం, ఎన్నెన్ని అనుభవాలు, ఆ అనుపమానమైన అనుబంధాన్ని అక్షరాలలో పొదువుకొని ఆ ప్రేమను విశ్వవ్యాప్తం చేసింది – 'గురుకృప'.

**న గురోరధికం తత్త్వం న గురోరధికం తపః ।**

**న గురోరధికం జ్ఞానం తస్మైశ్రీ గురువే నమః ॥**

గురువు కంటే ఉత్తమమైన తత్త్వం (గుణం) లేదు. గురువు కంటే ఉన్నతమైన తపస్సులేదు. గురువును మించిన జ్ఞానం లేదు. అటువంటి మహోన్నతమైన గురువుకు నమస్కారము–అని అర్థం. ఈ గురుస్తుతి గురు గుణగణ విశేషాల వర్ణనలోని ప్రతి పదం శ్రీబాబూజీని ఆవిష్కరిస్తుంది. "గురువును తెలుసుకో! ఎందుకొచ్చినట్లు పిడకలు ఏరుకోవడానికా" అన్నారు శ్రీసాయిబాబా. గురువును తెలుసుకోవడంలో రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి మన గురువును గుర్తించడం. రెండవది – ఆ గురువు యొక్క తత్త్వం, స్వరూప స్వభావాన్ని తెలుసుకోవడం. గురువుని గుర్తించడం ఎలా? తృప్తిని, శాంతిని, సంతోషాన్ని, నమ్మకాన్ని, నిశ్చింతను, మాటలలో వివరించలేని విధంగా మనలకు అనుభవమయ్యేలా చేసేవారే 'సద్గురువు' అని తెలిపారు శ్రీబాబూజీ. భక్తులు తమ అనుభవాలనే ప్రామాణికంగా చేసుకుంటే వారికి కలిగిన భావం – శ్రీబాబూజీయే తమ సద్గురువని. సద్గురు స్వరూపులైన శ్రీబాబూజీ తత్త్వం ఏమిటి? గురుకృపలో ప్రచురితమైన అనుభవాలను క్రోడీకరించి చూస్తే శ్రీబాబూజీ మూర్తీభవించిన ప్రేమస్వరూపం. అనంత సుజ్ఞాన సర్వస్వం, అపార మహిమాన్విత తత్త్వం. ఇంకొంత లోతుగా విశ్లేషిస్తే – అంతటా నిండిన అనంత చైతన్య స్వరూపం. వారి ప్రేమ ఎంతటిది అంటే వారు మనలను ప్రేమించి, ప్రేమించి మనం తిరిగి ప్రేమించకుండా ఉండలేనంత నిస్సహాయతకు గురిచేసేలా వారు ప్రేమిస్తారు. మనల్ని ప్రేమించే ప్రతిబంధంలో ఆ ప్రేమకు ఏదో ఒక కారణం ఉంటుంది. కానీ సద్గురుప్రేమకు అలాంటి కారణమేది ఉండదు. నీవెవరో, నీ గుణగణాలు, దుర్గుణాలు, బలాలు, బలహీనతలు ఏమిటో – అవన్నీ తెలిసికూడా నీ నుండి ఏమి ఆశించకుండా నిన్ను నిన్నుగా ప్రేమించే ప్రేమమూర్తి – శ్రీబాబూజీ.



# సద్గురు ప్రేమాక్షరాల రజతోత్సవం

**ధ్యానమూలం గురోర్మూర్తిః పూజామూలం గురోః పదమ్।**

**మంత్రమూలం గురోర్వాక్యం మోక్షమూలం గురోః కృపా ॥**

గురుస్వరూపం ధ్యానానికి మూలం. గురుపాదాలు పూజకు మూలం. గురువాక్యం మంత్రానికి మూలం. గురుకృప ముక్తికి అంటే దుఃఖ విముక్తికి, మహదానందానికి మూలం. అంతటి మహితమైన గురుకృపా వాహకం, సద్గురు ప్రసాదిత అనుభవాల సంచిక, సద్గురు ప్రేమ విపంచిక 'గురుకృప'. గత 25 వసంతాలుగా సద్గురువుని ప్రేమాక్షరాలతో 'గురుకృప' అర్చిస్తూనే ఉంది. ప్రతి అక్షరంలో ప్రేమ పొదిగి, సద్గురు కీర్తి కిరీటంలో అందంగా అమరి అలరిస్తూనే ఉంది. సద్గురువుకి ప్రేమతో అంకితమైన ఆ అక్షరాలన్నీ నేడు రజతోత్సవం జరుపుకుంటున్నాయి. శ్రీసాయి సచ్చరిత్ర సమస్తం శ్రీసాయిలీలా అనుభవ సారమే. అనుభవాల నేపథ్య ప్రబోధ ప్రబంధమే. ఈ కోణంలో సద్గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ ప్రసాదించిన అనుభవాలు, స్మృతులు, జీవిత విశేషాలు, ప్రబోధాలు, సత్సంగభాషణలు, సద్గురు మహిమ – ఇలా సద్గురువే సమస్తంగా సద్గురువు పట్ల ప్రేమను అక్షర సుమ మాలికలుగా, సంచికలుగా, సంపుటాలుగా నిక్షిప్తం చేసిన 'గురుకృప' – సద్గురు సచ్చరితమే. శ్రీసాయినాథుని శరత్‌బాబూజీతో సమన్వితమైన భావావేశపూరిత అద్భుత ప్రయాణం (ఎమోషనల్ గ్రేట్ జర్నీ) – ఈ 'గురుకృప'. ఏ చట్రంలో ఇమడని శ్రీబాబూజీని అన్నీ కోణాల్లో దర్శింపజేసే సద్గురుదర్శిని – ఈ 'గురుకృప'. ఇదో సుందరమైన సద్గురు ప్రబంధ కావ్యం.

భక్తజనబాహుళ్యాన్ని ఎంతగానో ప్రభావితం చేసి, వారి జీవితాలను ఆనందమయం జేసిన శ్రీబాబూజీ పరిచయంతోనే, వారిని చూస్తూనే ఎందరికో నాకు సంబంధించిన వారని అనిపిస్తుంది. ఒక్కసారి వారి సాన్నిధ్యంలో ప్రశాంతతను, నిర్మలతత్వాన్ని చవిచూసిన భక్త చకోరాలు మరలా మరలా ఆ సద్గురు చంద్రుని వెన్నెలకై పరితపిస్తాయి. వారి చూపు తాకితే భక్తజనసంద్రం ఉప్పొంగుతుంది. వారి చరణాలను స్పృశిస్తే హృదయం పరవశిస్తుంది. వారి ప్రేమ పలకరిస్తుంది. అంతరంగం పలవరిస్తుంది. వారు మన మనస్సులతో మాట్లాడతారు. మన ఆలోచనలను ప్రశ్నిస్తారు. వారి మాట అభయం. వారి సత్సంగ భాషణం సుజ్ఞానామృతం, సత్యం ప్రమాణం. అందుకేనేమో ఎప్పుడు అపనమ్మకంగా ఉండే మనస్సులు సైతం శ్రీబాబూజీ చెప్పిన దానిని మాత్రం నిస్సంకోచంగా నమ్ముతాయి. స్వీకరిస్తాయి. వారి సాన్నిధ్యం సేద తీర్చే అమ్మబడి. ఒట్టిపోయిన మనస్సులలో ప్రేమ దివ్వెలను వెలిగించే పవిత్రమైన గుడి. ప్రేమే ఆయుధంగా భక్తుల కష్టాలను కడతేర్చిన యోధుడు







నాకు అంత 'గ్రేస్' వద్దు అని అంటావు కదా? అన్నారు. అందరూ గొల్లుమని కొద్దిసేపు హాయిగా నవ్వుకున్నారు.

ప్రశ్న : సమాజంలో 'సోషల్ ఇన్‌జస్టిస్' జరుగుతుందని ప్రశ్న వేయబోతుంటే.

జవాబు : ఆ ప్రశ్న పూర్తికాకుండానే గురువుగారు, వేరేవాళ్ళ గురించి మనకెందుకయ్యా, నిజంగా మీరు సమాజ శ్రేయస్సునే కోరుతున్నారా? నీకు ఉద్యోగంలో ప్రమోషన్ కావాలి! మీ పిల్లవాడికి మెడికల్ కాలేజీలో సీటు, మీ అమ్మాయికి మంచి హోదా కలిగిన సంబంధం, మీ ఇంటి సమస్యలు ఇన్ని పెట్టుకొని 'సోషల్ ఇన్‌జస్టిస్' గురించి మాట్లాడుతావా? గాంధీగారు కొల్లాయి కట్టారు. అంటే **భారతీయుల్లో చాలా మందికి కట్టుకోవడానికి బట్టలు లేవు. ఇది ఆయన సొంత సమస్యగా భావించాడు కాబట్టే కొల్లాయి ధరించాడు. గౌతముడు రాజ్యంలో ఉన్న దుఃఖాన్ని చూచి వనాలకు వెళ్ళాడు. అది తన సమస్యగా భావించాడు కాబట్టే వెళ్ళాడు. నీవు కూడా అలా భావిస్తున్నావా?** సమాజ శ్రేయస్సు దృష్ట్యా లేదే. నీకు నీ పిల్లవాడూ, భార్య, ఇల్లు ముఖ్యంగా భావిస్తున్నావు. అలాంటప్పుడు 'సోషల్ ఇన్‌జస్టిస్' గురించి మాట్లాడటం, ఎంతవరకు భావ్యం – ఆలోచించండి. **పైకొకమాట, మనసులో వేరొక భావమా?**

**– డా॥ సాయివరప్రసాదరావు**

## బాబా మూడు రోజుల సమాధి గురించి ....

**గురుబంధువు :** బాబా మూడురోజులు తమ శరీరాన్ని వదిలి మళ్ళీ తిరిగి వస్తారు కదా, దాని ప్రాముఖ్యత ఏమిటి సార్? బాబా అలా చేయాల్సిన అవసరమేమిటి? ఎందుకు?

**గురువుగారు** : ఎవరికీ తెలియదు. నిజానికి చెప్పాలంటే ఆయన శరీరాన్ని విడిచిపెట్టారు అనేదానికి ఒక్కోసారి వాళ్ళు ఆ స్థితిలోకి పోయినపుడు శరీరంలో ఉండేటటువంటి ఒక రకమైన నిశ్చలత అది. (ఒక type of hibernation అది).

మామూలుగా శరీరంలో ఉండే ఫంక్షన్స్ కూడా ఆగిపోతాయి. మళ్ళా తిరిగి వస్తారు వాళ్ళు. కానీ వీళ్ళకి తెలియక ఒక్కోసారి దేహాన్ని సమాధి చేసే అవకాశం ఉంటుంది. ఆ శరీరంతో సాధించవలసినటువంటి పనులు కొన్ని ఉండేటపుడు "ఈ శరీరాన్ని జాగ్రత్తగా చూసుకో. మళ్ళీ మూడురోజుల తరువాత వస్తాను నేను" అని చెప్పి ఉంటారు.

"మళ్ళీ రాకపోతే బాబా?" అని అడిగి ఉంటాడు మహల్సాపతి, అంత తెలియదు కదా అతనికి.



రాకపోతే సమాధి చేద్దువులేరా అనుంటారు బాబా. అది చెప్పేటపుడు ఎట్లా చెప్పారంటే, "మూడు రోజులు వరకు చూడు, నేను రాకపోతే సమాధి చెయ్యండి" అనే విధంగా మలిచారు. అది వాళ్ళు నిద్రపోయి లేవడం లాంటిది. మంచి స్లీప్ తీసుకొని లేవడం లాంటిది.

**గురుబంధువు :** జీసస్ కూడా అలాగే చేసారని అంటారు. అది నిజంగా అలా జరిగిందా?

**గురువుగారు :** లేదు, ఇలా చేయలేదు, ఎందుకంటే అలా చేసి, మళ్ళీ ఆయనెక్కడ జీవించాడు? వాళ్ళు చెప్పేది కూడా ఏంటనంటే, అహ్మదీయ మూవ్‌మెంట్ అనే కల్ట్ ఒకటున్నది క్రిస్టియానిటీలో. ఆ కల్ట్ వాళ్ళు ఏం చెప్తారనంటే, జీసస్ నిజంగా చనిపోలేదు, ఎందుకనంటే జ్యూయిష్ సంప్రదాయం ప్రకారంగా, వాళ్ళు శవాన్ని పూడ్చిపెట్టడంగానీ, కాల్చడంగాని చేయరు. ఒక పెద్ద గుహలాగా ఉంటుంది. ఆ గుహలో శరీరాన్ని వేసేసి బండ కప్పేస్తారు, అంతే. శిలువ వేసిన తరువాత, ఆయన చనిపోయాడనుకొని తీసుకొచ్చి, గుహలో వేసేసారు. కానీ నిజంగా ఆయన చనిపోలేదు, చనిపోకుండా ఆ బండను త్రోసుకొని, బయటకు వచ్చేసాడు, మళ్ళీగాని అక్కడుంటే చంపేస్తారేమోనని అక్కడి నుంచి వెళ్ళిపోయి, ఇండియాకి వచ్చేసి హిమాలయాల్లో తిరుగుతూ, కాశ్మీర్లో శ్రీనగర్ దగ్గర సమాధి అయిపోయారు. ఇంకా కూడా ఆయన సమాధి అక్కడ ఉన్నది అనేటువంటిది ఒక కథనం. అక్కడ కూడా ఆయన చనిపోయి లేచారనే అర్థం కాదు వాళ్ళు చెప్పేది. ఆయన చనిపోలేదసలు, చనిపోయాడని మిస్టేక్ అయ్యారు అని అనుంటారు. ఇటువంటి స్టోరీస్ చాలా ఉన్నాయి. ఇంకేంటయ్యా?

**గురుబంధువు :** ఈ సంఘటన జరిగిన తర్వాత ఏమైనా చేంజ్ వచ్చిందా సార్, అంటే బాబా దగ్గర?

**గురువుగారు :** వచ్చిందిగా, మొత్తం ఆయన జీవితపంథాలోనే మార్పు వచ్చింది. ఆ ఇన్సిడెంట్ అయిన తర్వాతనే, ఇపుడు మనకుండే **"సాయిబాబా"**గా వ్యక్తం కావడం మొదలుపెట్టింది. అంతకు ముందు మామూలుగా ఎవ్వరితో సంబంధం లేనటువంటి ఒక ఫకీరులాగానే ఉండేవారు. ఏదో ఆ ఊర్లో ఉండే నలుగురూ వచ్చేవారు, కూర్చునేవాళ్ళు. వాళ్ళతో కలిసి కాసేపు హుక్కా పీల్చేవారు. కాసేపు కబుర్లు చెప్పేవారు. అంతవరకే. ఆ ఇన్సిడెంట్ అయిన తరువాత బయటనుండి రావడం మొదలుపెట్టారు. అక్కడి నుండి ఆయన మహిమ ప్రకటమవడం మొదలైంది. అలా ఒక ఫేజ్ నుండి ఇంకొక ఫేజ్‌లోకి మారేటువంటిది. అందుకనే నేను దాన్ని హైబర్‌నేషన్ అన్నది. ఈ మారేటువంటి మధ్యలో ఉండే ప్రక్రియ లాంటిదది.

**–సాయిపథం, శిరిడీ**

## బాబా నిత్యం ఒక ఇటుకరాయిని ఎందుకు తమ వద్ద ఉంచుకునేవారు?



**గురుబంధువు :** బాబా నిత్యం ఒక ఇటుకరాయిని ఎందుకు తమ వద్ద ఉంచుకునేవారు? బాబాకు, వారు ఎప్పుడూ తమతోనే ఉంచుకున్న ఇటుకరాయికి ఉన్న సంబంధమేమిటి సార్?

**గురువుగారు :** తెలియదు, ఆ ఇటుకరాయి విరిగినపుడు, **"నా ప్రారబ్ధం విరిగింది. ఇంక నేనెక్కువ కాలం ఉండను" అన్నారు బాబా.** ఇస్లాం సాంప్రదాయంలో, సూఫీ సాంప్రదాయంలో ప్రత్యేకంగా గురువు శిష్యుడికి దీక్ష ఇచ్చినపుడు వాళ్ళు ఒక వస్తువునుగానీ,వాళ్ళ కఫ్నీగాని, వాళ్ళ చేతికర్రగానీ, వాళ్ళ జపమాల గానీ, లేదా ఇట్లా ఏదో ఒక వస్తువును ఆ సందర్భంలో ఆ సమయానికి ఇచ్చేటువంటిది. ఒక వస్తువు వాళ్ళ చేతికిస్తారు, ఇచ్చి కొంతమందికి ఏం చెప్తారంటే, ఒక దగ్గర ఉండవద్దని చెప్తారు. కొంతమందిని ఒక దగ్గరే ఉండిపొమ్మని చెప్తారు. ఇక వాళ్ళు ఆ స్థానం వదలకూడదు, ఇటువంటి సాంప్రదాయం ఉన్నది వాళ్ళలో. ఎవరిచ్చారో అది మాత్రం మనకు బాబా ఎపుడూ చెప్పలేదు. కానీ ఇటువంటి ఇటుకరాయి పెట్టుకొని ఉండే మహాత్ములెవరైనా ఉన్నారా అని నేను దాని గురించి బాగా విచారిస్తే మాత్రం ఒకరిద్దరు కనిపిస్తున్నారు. ఒక వస్తువు మాత్రం వాళ్ళెపుడూ తమ దగ్గరే ఉంచుకునేవారు. మళ్ళా వాళ్ళకి వారసులొచ్చినపుడు ఆ వస్తువు వారసులకిచ్చేసి వెళ్ళిపోతారు. బాబాకు వారసులనేటువంటి ప్రశ్న లేదు కనుక ఆ ఇటుకరాయి అక్కడే విరిగిపోయింది. తెలంగాణలో ఖాజీపేటలో ఒక దర్గా ఉంది. 'బియాబాని దర్గా'. ఆయన కూడా ఎప్పుడూ ఓ ఇటుకరాయి దగ్గర పెట్టుకొని ఉండేవారు ఇట్లాగే. కాబట్టి సూఫీ సంప్రదాయంలో ఇట్లా ఒక వస్తువు అది ఇటుకరాయి కావచ్చు, ఇంకొకటి కావచ్చు. ప్రతి ఒక్కరి దగ్గర మాత్రం ఒక వస్తువు ఉంటుంది. కొంతమంది ఇటుకరాయి కూడా పెట్టుకొని ఉండేవారు అనే విషయం తెలిసింది. అంతకుమించి బాబా దాని గురించి ఎపుడూ మాట్లాడేవారు కాదు.

**గురుబంధువు :** మొదటిసారి శిరిడీకి వచ్చినప్పటి నుండి బాబా దగ్గర ఆ ఇటుకరాయి ఉందా? "ఇది నా గురుప్రసాదం" అని బాబా అన్నారంటారు. సచ్చరిత్రలో ఆ ఇటుక ఉండేదా బాబా దగ్గర?

**గురువుగారు :** ఊc, ఉండేది.

**–సాయిపథం, శిరిడీ**